టాప్ న్యూస్

## ఎక్కడి నుండి వచ్చాం కాదు.. ఎక్కడికి వెళ్ళామన్నదే ముఖ్యం


- మిస్ ఇండియా నందిని గుప్తా వ్యాఖ్యలు
- భారత్ నుంచి మిస్ వరల్డ్ కు నందిని గుప్తా పోటీ



02

## పాకిస్తాన్ తప్పు చేసింది


- తప్పు చేసిన వారు శిక్ష అనుభవించాలని భగవద్గీత చెబుతోంది
- తిరిగి చెల్లించాల్సిన సమయం ఆసన్నమైంది
- ఉగ్రదాడిపై ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ సంచలన వ్యాఖ్యలు



02

## సీతమ్మసాగర్ కు అనుమతి

- తెలంగాణ చరిత్రలో ల్యాండ్ మార్క్
- ఏడాదిన్నర కృషి ఫలించింది
- కాళేశ్వరం వాళ్ళే కట్టారు.. వాళ్ల హయంలోనే కూలింది
- నీటిపారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



02


ANN తెలుగు

Follow: @ANNTELUGU

27-04-2025

# మహా పత్రిక

ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 145 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




**కంది రామచంద్రారెడ్డి**

*వీకెండ్ అనాలసిస్*

కశ్మీర్‌లో ఉగ్రవాదం కోరలు పీకామని, ఇక అక్కడేం చేయలేక జమ్మూ ప్రాంతంలో మిలిటెంట్లు తమ ప్రతాపాన్ని చూపిస్తున్నారని జమ్మూ, కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా అన్న కొన్ని రోజులకే దారుణం జరిగింది. ఉగ్రవాదం ఎప్పుడు పడగవిప్పి బుసలు కొడుతుందో అంచనా వేయటం సులభం కాదు. పహల్గాం దాడి నేపథ్యమలో దేశమంతా ఏకమై మోదీ వెనుక నిలబడింది. సింధూ నదీజలాల ఒప్పందం నిలిపివేతను పాకిస్తాన్ ఊహించలేదు. ఇరు దేశాల మధ్య యుద్ధం వచ్చిన సందర్భాల్లో... ముంబైపై ఉగ్రదాడి జరిగినప్పుడు, పుల్వామాలో మన జవాన్లను ఉగ్రవాదులు పొట్టనబెట్టుకున్నప్పుడు కూడా మన దేశం ఆ ఒప్పందం నిలిపివేత గురించి మాట్లాడలేదు. సింధూ నదీజలాలపై పాకిస్తాన్ సాగునీటిరంగం 80 శాతం వరకూ ఆధారపడి వుంటుంది. ప్రపంచంలో తీవ్రమైన నీటికొరతను ఎదుర్కొనే దేశాల్లో పాకిస్తాన్ ఒకటి. ప్రభుత్వం ఒక చర్య తీసుకునే ముందు ఎన్నో బేరీజు వేసుకోవాల్సి వుంటుంది. అది యుద్ధంగా మారిన పక్షంలో... మనవైపు గట్టిగా నిలబడే వారెవరు, వ్యూహాత్మకంగా ఎదురయ్యే సమస్యలేమిటి, దళాల సంసిద్ధత, సాంకేతిక సామర్థ్యాల్లో మన స్థానం ఏమిటి అనేవి చూసుకోవాలి. అందుకే ఆలస్యమైనా మోదీ కొట్టే దెబ్బ గట్టిగా ఉంటుందని దేశం భావిస్తోంది. కోరుకుంటోంది.

- తాజా రాజకీయ పరిణామాలపై ఎఎన్ఎన్ సిఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ ఎనాలసిస్

ఎడిటోరియల్ పేజీ 4లో

# కాళేశ్వరం కరప్షన్ ఫైల్స్

## ఈఎన్ సీ హరిరామ్ ఇంట్లో రైడ్.. అరెస్ట్

ఎన్డీఎస్ఏ రిపోర్ట్ తో ఏసీబీ మెరుపుదాడులు

ఏకకాలంలో 14 చోట్ల సోదాలు.. హరిరామ్ బంధువుల ఇళ్ళూ జల్లెడ


కళ్ళు చెదిరే ఆస్తులు.. గజ్వేల్‌లో 28 ఎకరాల భూమి పత్రాలు స్వాధీనం

హైదరాబాద్ లో ఆరు విల్లాలు..ఇళ్ళు.. పదికి పైగా ప్లాట్లు.. కార్లు.. ఫామ్ హౌజ్ లు

కాళేశ్వరం కార్పొరేషన్ ఎండీగా ఉన్న హరిరామ్

కాంట్రాక్టర్లకు రూ.64వేల కోట్ల చెల్లింపులు

హైదరాబాద్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సోదాలు




**హైదరాబాద్, మహా:** కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్డీఎస్ఏ ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా ఏసీబీ అధికారులు మెరుపు దాడులకు దిగారు. షేక్‌పేట్‌లోని ఆదిత్య టవర్స్ లో ఉన్న ఈఎన్సీ హరిరామ్ నివాసంతో పాటు మొత్తం 14 చోట్ల సోదాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఆయన కాళేశ్వరం కార్పొరేషన్ ఎండీగా, గజ్వేల్ ప్రాంత ఈఎన్సీగా విధులు నిర్వర్తిస్తున్నారు. కాళేశ్వరం అనుమతులు, డిజైన్లు, రుణాల సమీకరణలోనూ ఆయన అత్యంత కీలకంగా వ్యవహరించినట్లు అధికారులు గుర్తించారు. హరిరామ్ భార్య అనిత కూడా నీటిపారుదల శాఖలో డిప్యూటీ ఈఎన్‌సీగా పనిచేశారు. ప్రస్తుతం ఆమె వాలంటరీ డైరెక్టర్ జనరల్ బాధ్యతల్లో కొనసాగుతున్నారు.

మిగతా 2లో

## ట్రంప్ రిలీఫ్.. తగ్గిన పెద్దన్న

03







# రాజకీయాల్లోకి కొత్త తరం రావాలి

కొత్త తరం భాషను నాయకులు అర్థం చేసుకోవాలి.. యువ నేతలను ప్రోత్సహించాలి

భారత్ సమ్మిట్ లో ఏఐసీసీ అగ్రనేత, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పిలుపు

అన్ని వర్గాల ఆకాంక్షలు నెరవేర్చడమే మా లక్ష్యం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మహా:** గత పదేళ్లలో ప్రపంచ రాజకీయాలు మారిపోయాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ఆధునిక సామాజిక మాధ్యమాలతో అంతా మారిపోయిందని తెలిపారు. రాజకీయాల్లోకి కొత్తతరం రావాలని రాహుల్ సూచించారు. దేశ సమస్యలు తెలుసుకునేందుకు కన్యాకుమారి నుంచి సుమారు 4 వేల కిలోమీటర్ల పాదయాత్ర చేశానన్నారు. పాదయాత్ర మొదలు పెట్టక ముందు ఆలోచించాను.. మొదలుపెట్టాక వెనకడుగు వేయలేదని వివరించారు. హైదరాబాద్‌లో జరుగుతున్న భారత్ సమ్మిట్ కార్యక్రమంలో రాహుల్ గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాదయాత్ర మొదలు పెట్టాక చాలా మంది నాతో కలిసి నడవటం మొదలుపెట్టారన్నారు. పాదయాత్రలో జనం సమస్యలు వినటం నేర్చుకున్నానని, ఇప్పుడు వారి సమస్యలు వినటంలో నాయకులు విఫలమయ్యారని రాహుల్ గాంధీ వివరించారు.

మిగతా 2లో

## రాహుల్‌కు ఘనస్వాగతం

ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ లు ఘనస్వాగతం పలికారు. ఏఐసీసీ ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాహుల్ నోవాటెల్ భారత్ సమ్మిట్ లో ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ దేశాల నుండి వచ్చిన ప్రతినిధులను అభినందించారు.

# కర్రెగుట్టల్లో కాల్పుల మోత


## 37కి చేరిన మావోయిస్టుల మృతుల సంఖ్య?

- హెలికాప్టర్లతో నిఘా..లొంగుబాటు ప్రచారం
- అధికారికంగా రాని ప్రకటనలు.. పరిస్థితిపై హక్కుల సంఘాల ఆందోళన
- ఐదు రోజులుగా హైటెన్షన్



**హైదరాబాద్, వరంగల్, మహా:** తెలంగాణ, చత్తీస్‌ఘడ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో కూంబింగ్ కొనసాగుతోంది. భద్రతా బలగాలు జరిపిన కాల్పుల్లో ఏకంగా మావోయిస్టుల మృతుల సంఖ్య 37కి చేరినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించలేదు. ఆపరేటన్ కగార్ పేరుతో.. కొన్ని నెలలుగా కర్రెగుట్టల్లో మావోల వేట సాగిస్తున్నారు సీఆర్ పీఎఫ్ బలగాలు. ప్రత్యేక హెలికాప్టర్లతో నిఘా పెట్టారు. ఈ క్రమంలోనే 2025, ఏప్రిల్ 25వ తేదీ రాత్రి.. కర్రెగుట్టల్లో సీఆర్ పీఎఫ్ బలగాలకు.. మావోయిస్టులు ఎదురుపడ్డారు.

మిగతా 2లో



## మస్కిటో కాయిల్ పొగతో బాలుడు మృతి

### మరో బాలిక పరిస్థితి విషమం

**ఎల్బీనగర్,మహా:** మస్కిటో కాయిల్ ఓ బాలుడి ప్రాణం తీయగా మరో బాలిక ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతుంది. ఈ ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్ద అంబర్ పేట్ భువనేశ్వరి కాలనీలో చోటుచేసుకుంది. హయత్ నగర్ సీఐ నాగరాజుగౌడ్ వివరాల ప్రకారం పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీ పరిధిలోని భువనేశ్వరి కాలనీలో నివాసం ఉంటున్న అబ్దుల్ ఖాదర్ జిలానీ తన భార్య,నలుగురు పిల్లలతో కలిసి నివసిస్తున్నాడు.శుక్రవారం రాత్రి సమయంలో దోమల నివారణకు మస్కిటో కాయిల్ వెలిగించారు.

మిగతా 2లో



## గులాబీ.. వరం..గల్

- పాతికేళ్ల పతాక
- నేడు భారీ సభ.. గులాబీ శ్రేణులన్నీ అదే బాట
- కేసీఆర్ ప్రసంగంపై ఆసక్తి

వివరాలు 3లో

## భారత్-పాకిస్థాన్ యుద్ధం డేట్ ఫిక్స్

### పాక్ మాజీ హైకమిషనర్ సంచలన కామెంట్స్

మే మొదటి వారంలో లేదా మధ్యన భారత్ దాడి చేసే అవకాశం


**మహా:** జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య టెన్షన్ వాతావరణ నెలకొంది. ఏ క్షణమైనా యుద్ధం జరగొచ్చనే ప్రచారం నడుస్తోంది. అయితే తాజాగా పాకిస్థాన్ మాజీ హైకమిషనర్ అబ్దుల్ బాసిత్ కీలక వ్యాఖ్యలు చేశారు.

మిగతా 2లో



## పాకిస్తాన్ కొడుకులకు కామన్ సెన్స్ లేదు

- కశ్మీర్ ఇండియాదే.. కశ్మీరీలు మనోళ్లే
- ఉగ్రదాడిపై రెచ్చిపోయిన విజయ్ దేవరకొండ



వివరాలు 3లో

## అవును.. కాళేశ్వరం 8వ వింతే

### కట్టడం.. కూలడం మూడేళ్ళలోనే..

- ప్రపంచ చరిత్రలోనే ఇలాంటి ప్రాజెక్టులేదు
- మేడిగడ్డ, సుందిళ్ళ పనికిరావని ఎన్డీఎస్ఏ రిపోర్ట్
- కమిషన్ల కోసం ప్రాజెక్టు వేరే చోట కట్టారు
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ధ్వజం

02

## కేసీఆర్‌కు ముప్పు

- కాళేశ్వరం ప్రాజెక్ట్ డబ్బుతోనే ప్లీనరీ సభ
- బీజేపీ ఎంపీ అరవింద్ సంచలన వ్యాఖ్యలు

వివరాలు 3లో

# ఎక్కడినుండి వచ్చాం కాదు..
# ఎక్కడికి వెళ్ళామన్నదే ముఖ్యం


## మిస్ ఇండియా నందిని గుప్తా వ్యాఖ్యలు
## భారత్ నుంచి మిస్ వరల్డ్‌కు నందిని గుప్తా పోటీ



**హైదరాబాద్, మహా:** ప్రపంచ సుందరి పోటీలకు సర్వం సిద్ధమవుతోంది. మొట్టమొదటి సారిగా మిస్ వరల్డ్ పోటీలకు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ పోటీల్లో మొత్తం 120 దేశాలు పోటీ పడనుండగా భారత్ నుంచి మిస్ వరల్డ్ కిరీటం కోసం పోటీలో నిలుస్తోంది రాజస్థాన్ కచ్ ప్రాంతానికి చెందిన నందిని గుప్తా. 2023 మిస్ ఇండియా కిరీటాన్ని సొంత చేసుకున్న నందిని ఈసారి భారత్ నుంచి ప్రపంచ వేదికపై నిలవనుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ వచ్చిన నందిని గుప్తా మీడియాతో మాట్లాడారు. రైతు కుటుంబం నుంచి ఫ్యాషన్ ప్రపంచంలో సత్తా చాటాను. పదేళ్ల వయసులోనే ఐశ్వర్యరాయ్‌ను చూసి స్ఫూర్తిని పొందా. కలల్ని సాకారం చేసుకోవడంలో విజయం సాధించా. మస్టర్డ్స్ ఫీల్డ్ నుంచి ఫ్యాషన్ ప్రపంచంలో ఎదిగిన తీరు గర్వంలాగా ఉంది. ఎక్కడి నుంచి వచ్చామన్నది కాదు.. ఎక్కడికి వెళ్లామన్నదే ముఖ్యం. బాహ్య సౌందర్యం కంటే అంతః సౌందర్యమే అసలైన అందం. చీర కట్టంటే నాకు ఎంతో ఇష్టం. చార్మినార్ ప్రాంతం అక్కడి రుచులు నన్నెంతో ఆకట్టుకున్నాయి. యాదగిరిగుట్ట, రామప్ప దేవాలయం, బుద్ధవనం చూడాలని చాలా ఆత్రుతగా ఉంది. ఆతిధ్యానికి మారు పేరు హైదరాబాద్." అని అన్నారు.

# కాళేశ్వరం కరప్షన్ ఫైల్స్

## ఈఎన్ సీ హరిరామ్ ఇంట్లో రైడ్.. అరెస్ట్



(మొదటిపేజీ తరువాయి)

సోదాల్లో భాగంగా హరిరామ్ పేరిట భారీగా ఆస్తులు ఉన్నట్లుగా ఏసీబీ అధికారులు గుర్తించారు. దీంతో ఆయనను అరెస్ట్ చేసి లెక్క తీస్తున్నారు. గజ్వేల్‌లో 28 ఎకరాల భూమి పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా 3 బ్యాంక్ లాకర్లు ఉన్నట్లుగా అధికారులు గుర్తించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో లోపాల మూలంగానే కుంగిపోయిందన్న కారణంతో కాంగ్రెస్ ప్రభుత్వం గతేడాది సెప్టెంబర్ 27న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ను ఏర్పాటు చేసింది. కాగా గజ్వేల్ ఈఎన్సీ, కాళేశ్వరం కార్పొరేషన్ ఎండీగా ఉన్న హరిరామ్‌ను ఈ కేసులో భాగంగా విచారించింది. ప్రాజెక్టు నిర్మాణ బిల్లుల చెల్లింపులకు ఏర్పాటు చేసిన కాళేశ్వరం కార్పొరేషన్ ఆర్థిక అంశాలపై సైతం కమిషన్ ఆరా తీసింది. కార్పొరేషన్ ద్వారా బ్యాంకులకు రూ.29,737 కోట్లు వరకు తిరిగి చెల్లించినట్లుగా ఆయన విచారణలో తెలిపారు.

**కళ్ళు చెదిరే ఆస్తులు.. అధికారుల షాక్**

భూక్యా హరిరామ్ ఆస్తుల చిట్టా చూస్తే కళ్లు చెదిరిపోయేలా ఉండటంతో అధికారులే షాక్ అవుతున్నారు. ఆయనకు షామీర్ పేట్‌లో విల్లా, కొండాపూర్‌లో విల్లా, శ్రీనగర్‌లో ఫ్లాట్, మాదాపూర్‌లో ఫ్లాట్, నార్సింగిలో ఫ్లాట్, అమరావతిలో కమర్షియల్ స్పేస్, మర్కూక్ మండల్‌లో 28 ఎకరాల అగ్రికల్చర్ ల్యాండ్, పటాన్‌చెరులో 20 గుంటల భూమి, హైదరాబాద్‌లోని శ్రీనగర్ కాలనీలో 2 ఇండిపెండెంట్ ఇళ్లు, బొమ్మలరామారంలో ఒక ఫామ్ హౌస్ ఆరు ఎకరాల మామిడితోట, కొత్తగూడెంలో నిర్మాణంలో ఉన్న ఇల్లు, కుత్బుల్లాపూర్‌లో ఓపెన్ ఫ్లాట్, మిర్యాలగూడలో ఓపెన్ ఫ్లాట్, ఒక బీఎంబ్ల్యూ రెండు కార్లు, బంగారు ఆభరణాలు, బ్యాంకులో జమ చేసిన నగదు ఉన్నట్టు గుర్తించారు.

**కాంట్రాక్టర్లకు రూ.64వేల కోట్ల చెల్లింపులు**

బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాల్లో రూ.64 వేల కోట్లు కాంట్రాక్టర్లకు చెల్లించామని హరిరామ్ పేర్కొన్నారు. కార్పొరేషన్ ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్లను ఇప్పటికే కొత్తగా ఏర్పడిన ప్రభుత్వానికి అందజేశామని తెలిపారు. మేడిగడ్డ బ్యారేజీ డామేజ్‌కు బాధ్యులెవరంటూ చంద్రఘోష్ కమిషన్.. హరిరామ్‌ను ప్రశ్నించగా గేట్స్ ఆపరేషన్, మెయింటెనెన్స్ సరిగ్గా లేకపోవడం అందుకు ప్రధాన కారణమని తెలిపారు. 2017లో నాటి ఉన్నత స్థాయి కమిటీ అంశాలను కాళేశ్వరం చీఫ్ ఇంజినీర్ ఫాలో కాలేదని హరిరామ్ కమిషన్ ఎదుట స్పష్టం చేశారు. కాగా ఇప్పుడు ఆయన ఇంటిపై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించడం సంచలనంగా మారింది.

**ఆ జిల్లాల్లో కూడా**

మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణల నేపథ్యంలో, హరిరాం పై కొన్ని రోజులుగా ఏసీబీ నిఘా ఉంచి, అతని స్వగ్రామమైన ఎదురుగడ్డలో ఆయన కుటుంబ సభ్యుల నివాసాల్లో సుదీర్ఘంగా తనిఖీలు సాగించాయి. ఈ దాడుల సమయంలో ఏసీబీ బృందం అనేక విలువైన పత్రాలు, స్థిరాస్తుల డాక్యుమెంట్లు, భారీ మొత్తంలో నగదు, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ప్రాథమిక సమాచారం. హరిరాం సన్నిహితుల పేర్లతో భూములు, ఇండ్లు, వాణిజ్య స్థలాల కొనుగోళ్లు జరిగినట్లు తెలుస్తోంది. బ్యాంకు ఖాతాల్లో అనుమానాస్పద లావాదేవీల వివరాలను కూడా ఏసీబీ అధికారులు సేకరిస్తున్నారు.


## మస్కిటో కాయిల్ పొగతో బాలుడు మృతి

(మొదటిపేజీ తరువాయి)

తెల్లవారుజామున సుమారు 4 గంటల ప్రాంతంలో కాయిల్ పరుపుపై పడడంతో నిప్పంటుకుని, గది మొత్తం పొగతో నిండింది. ఈ ప్రమాదంలో పరుపుపై పడుకున్న బాలుడు అబ్దుల్ రెహమాన్ (4) ఊపిరాడక మృతిచెందాడు. బాలిక ఆతిఫా(4) తీవ్రంగా గాయపడడంతో నీలోఫర్ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు.అబ్దుల్ ఖాదర్ కు ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు మొత్తం నలుగురు పిల్లలు కాగా.. పెద్ద కొడుకు అర్హన్, పెద్ద కూతురు ఆఫియా హాల్ లో పడుకున్నారు. జిలానీ, భార్య ఫాజియ బేగం, చిన్న కుమారుడు అబ్దుల్ రెహమాన్, చిన్న కుమార్తె ఆతిఫా నలుగురు బెడ్ రూమ్ లో పడుకున్నారు. సమాచారం తెలుసుకున్న హయత్ నగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదాన్ని పరిశీలించారు.ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# పాకిస్తాన్ తప్పు చేసింది

## తప్పు చేసిన వారు శిక్ష అనుభవించాలని భగవద్గీత చెబుతోంది
## తిరిగి చెల్లించాల్సిన సమయం ఆసన్నమైంది
## ఉగ్రదాడిపై ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ సంచలన వ్యాఖ్యలు



**మహా:** జమ్మూకశ్మీర్‌లో జరిగిన పహల్గాం ఉగ్రదాడిపై ఆర్ఎస్ఎస్ చీఫ్.. మోహన్ భగవత్ స్పందించారు. శనివారం ఢిల్లీలో నిర్వహించిన ఓ పుస్తకావిష్కరణ సభలో ఆయన మాట్లాడారు. '' పొరుగు దేశాలతో తమకు గొడవలు, యుద్ధం అవసరం లేదు. శాశ్వత శాంతి కోసమే ఇన్నాళ్లు మౌనంగా ఉన్నాం. కానీ వాళ్లు ఉగ్రదాడులు చేస్తూ అమాయకులను బలి తీసుకుంటున్నారు. ఇప్పుడు దాడులతో సంబంధం లేదని చెబుతున్నారు. తప్పు చేసిన వాళ్లని శిక్షించాలని భగవద్గీత చెబుతోంది. పాకిస్థాన్ తప్పు చేసింది. కాబట్టి తప్పకుండా శిక్ష అనుభవించాల్సిందే. ఆరోజు రాముడు కూడా.. రావణాసురుడిని రాజ్య ప్రజల సంక్షేమం కోసం మాత్రమే చంపారు. కానీ అది హింస కాదు. ఎవరైనా మాత్రం తప్పుడు మార్గాన్ని ఎంచుకుంటే అది తప్పు అని చెప్పి.. సరైన మార్గంలో నడిపించడమే రాజు బాధ్యత. ఇప్పుడు రాజు తాను చేయాల్సిన పని చేసుకుంటూ పోతాడని'' మోహన్ భగవత్ అన్నారు. అలాగే ఈ దాడి దేశ ప్రజలను ఎంతో వేదనకు గురిచేసిందని.. ఇలాంటివి ఎట్టి పరిస్థితుల్లో కూడా ఉపేక్షించేది లేదని అన్నారు. తిరిగి చెల్లించాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. మనకు బలం లేకపోతో వేరే మార్గాన్ని ఎంచుకునే వాళ్లమని.. ఇప్పుడు మనం బలవంతులం కాబట్టి తప్పకుంటా మన బలమేంటో చూపించాలని మోహన్ భగవత్ అన్నారు.




## ఫెమినా మిస్ ఇండియాకు స్వాగతం పలికిన మంత్రి పొన్నం, స్మితా సబర్వాల్

**హైదరాబాద్:** మిస్ వరల్డ్ పోటీల నేపథ్యంలో ఫెమినా మిస్ ఇండియా 2023 నందిని గుప్తా హైదరాబాద్ చేరుకున్నారు. శనివారం బేగంపేట టూరిజం ప్లాజాలో నందిని గుప్తాకు మంత్రి పొన్నం ప్రభాకర్ , టూరిజం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ స్మితా సబర్వాల్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ నందిని గుప్తాను సత్కరించారు. తెలంగాణ ప్రభుత్వం పెట్టుబడులను, పర్యాటకులను ఆకర్షించే లక్ష్యంగా మిస్ వరల్డ్ పోటీలను నిర్వహిస్తోంది. ఈ మిస్ వరల్డ్ పోటీలను రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. మిస్ వరల్డ్2025 పోటీలు మే 7వ తేదీ నుంచి మే 31వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో దాదాపు 140 దేశాలకు చెందిన వారు పాల్గొననున్నారు. తెలంగాణలోని 10 ప్రాంతాల్లో మిస్ వరల్డ్ పోటీలు జరగనున్నాయి. ప్రారంభ, ముగింపు కార్యక్రమాలు హైదరాబాద్‌లో జరుగుతాయి.

# అవును.. కాళేశ్వరం 8వ వింతే

## కట్టడం.. కూలడం మూడేళ్ళలోనే

- ప్రపంచ చరిత్రలోనే ఇలాంటి ప్రాజెక్టులేదు
- మేడిగడ్డ, సుందిళ్ళ పనికిరావని ఎన్డీఎస్ఏ రిపోర్ట్ ఇచ్చింది
- కమిషన్ల కోసం ప్రాజెక్టు వేరే చోట కట్టారు
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ధ్వజం



**హైదరాబాద్:** ఎన్డీఎస్ఏ రిపోర్టు తాము బయట పెట్టలేదని.. వాళ్లే బయట పెట్టారని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. కాళేశ్వరం ఒక నాసిరకం ప్రాజెక్ట్ అని విమర్శించారు. శనివారం హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వేషన్ సెంటర్‌లో జరుగుతున్న భారత్ సమ్మిట్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ... కాళేశ్వరం తన మానస పుత్రిక అని మాజీ సీఎం కేసీఆర్ చెప్పారని గుర్తుచేశారు. కాళేశ్వరం కథ త్వరలోనే అందరికీ తెలుస్తుందని అన్నారు. రీడిజైనింగ్ పేరుతో కాళేశ్వరం చేపట్టి మోసం చేశారని ఆరోపించారు. తెలివి ఉన్న ఎవరైనా కాళేశ్వరం చేపడతారా అని ప్రశ్నించారు. తమ్మిడిహట్టి పూర్తయితే కాంగ్రెస్‌కు పేరు వస్తుందని పక్కన పెట్టారని ధ్వజమెత్తారు. మేడిగడ్డ కుంగిపోవడం చిన్న విషయం అన్నట్లుగా మాట్లాడారని అన్నారు. మేడిగడ్డ, సుందిళ్ల పనికిరావని ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చిందని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. కాళేశ్వరం 8వ వింత అని కేసీఆర్ అనలేదా అని ప్రశ్నించారు. మూడేళ్లలో నిర్మాణం, మూడేళ్లలో కూలిపోవడం 8వ వింతగా కేసీఆర్ చెప్పిందే నిజం అయ్యిందని విమర్శించారు. ఎన్డీఎస్ఏ రిపోర్టు ద్వారా గత బీఆర్ఎస్ ప్రభుత్వ బాగోతం బయటపడిందని విమర్శలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును డిజైన్ చేసింది కేసీఆర్ అని ఆరోపించారు. తుమ్మిడిహెట్టి వద్ద ఈ ప్రాజెక్టు కట్టకుండా.. కమీషన్ల కోసం వేరే చోట ప్రాజెక్టు కట్టారని మండిపడ్డారు. త్వరలోనే బాధ్యులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# కర్రెగుట్టల్లో కాల్పుల మోత

(మొదటిపేజీ తరువాయి)

రెండు వర్గాల మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో.. 28 మంది మావోయిస్టులు చనిపోయినట్లు తెలుస్తోంది. మావోల ఎన్ కౌంటర్‌పై ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. కర్రెగుట్టల్లో మొత్తం వెయ్యి మంది మావోయిస్టులు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు భద్రతా బలగాలు. 2026 మార్చి నాటికి దేశంలో నక్సలిజాన్ని అంతం చేయాలని కంకణం కట్టుకున్న కేంద్ర ప్రభుత్వం.. ఇందు కోసం ఆపరేషన్ కగార్ చేపట్టింది. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా ఆపరేషన్ కగార్ ముమ్మరంగా సాగుతోంది. ఈ క్రమంలోనే తెలంగాణఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టల్లో మావోయిస్టు పార్టీ కీలక నేత హిడ్మాతో పాటు మరో వెయ్యి మందికి పైగా నక్సలైట్లు ఉన్నట్లు భద్రతా దళాలకు నిఘావర్గాల నుంచి సమాచారం అందింది. దీంతో కర్రెగుట్టలో ఐదు రోజుల నుంచి కేంద్ర, రాష్ట్ర బలగాలు కూంబింగ్ చేపట్టాయి. తెలంగాణఛత్తీస్‌గఢ్‌మహారాష్ట్ర మూడు వైపుల నుంచి కర్రెగుట్టలను భద్రతా దళాలు చుట్టుముట్టాయి. హిడ్మాతో పాటు మరికొందరు కీలక నేతలే లక్ష్యంగా భద్రతా దళాలు ముందుకు సాగుతున్నాయి. ఈ క్రమంలో భద్రతా దళాలు, మవోయిస్టుల మధ్య భీకర ఎదురు కాల్పులతో కర్రెగుట్టలు తుటాల మోతతో దద్దరిల్లుతున్నాయి. అయితే ఈ ఆపరేషన్ ఛత్తీస్ గడ్ ప్రభుత్వం చేపట్టినట్లు తెలంగాణ పోలీసులు ప్రకటించారు. తమ ప్రభుత్వాన్ని సంప్రదించలేదని, తెలంగాణ భూభాగంలో ఎవరూ లేరని చెప్పారు.




## ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో రెస్క్యూ ఆపరేషన్‌కు మూడు నెలలు బ్రేక్!

**హైదరాబాద్, మహా:** ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో సహాయక చర్యలకు అధికారులు 3 నెలల బ్రేక్ ఇచ్చినట్లు అధికారులు ప్రకటించారు. డేంజర్ జోన్ మినహా శిథిలాల తొలగింపు పూర్తి అవ్వడంతో తాజాగా ఎక్స్‌కవేటర్లు సొరంగం నుండి బయటకు వచ్చేశాయి. ఇంకా ఆరుగురు కార్మికుల ఆచూకీ లభించలేదు. 63 రోజులుగా రెస్క్యూ ఆపరేషన్ చేపట్టినప్పటికీ ఇంత వరకు రెండు మృతదేహాలు మాత్రమే దొరికాయి. ఫిబ్రవరి 22న సొరంగంలో ప్రమాదం జరగగా, 8 మంది అందులో చిక్కుకున్నారు. కాలువ లోపల రెస్క్యూ ఆపరేషన్ల పై నిపుణుల కమిటీ, ఎస్ ఎల్ బిసి టన్నెల్ డేంజర్ జోన్‌లో రెస్క్యూ ఆపరేషన్లు, భవిష్యత్ పనులకు ఇన్లెట్ ప్రాంతం ద్వారా సాంప్రదాయ డ్రిల్, బ్లాస్ట్ పద్ధతి తప్ప వేరే మార్గం లేదని భావిస్తున్నట్లు తెలిపింది. జలసౌధలో జరిగిన అధికారులు, కమిటీ సభ్యుల సమావేశంలో.. సొరంగం 50 మీటర్ల ప్రమాద ప్రాంతంలో రాళ్ల పొరలు, నీరు , ఇతర అంశాల వల్ల సొరంగం మళ్లీ కూలిపోయే ప్రమాదం ఉందని నిపుణులు అనుకుంటున్నారు. దీంతో ఇక్కడ సహాయక చర్యలు మరింత ప్రమాదకరంగా మారాయి. పర్యావరణ నిబంధనలను పరిశీలించి సిఫార్సులు చేయడానికి అధికారులు ఒక సాంకేతిక ఉపసంఘాన్ని ప్రభుత్వ ఏర్పాటు చేసింది. అనేక జాతీయ సంస్థలతో పాటు, కల్నల్ పరీక్షిత్ మెహ్రా కూడా ఇందులో ఉన్నారు.




# రాజకీయాల్లోకి కొత్త తరం రావాలి

(మొదటిపేజీ తరువాయి)

నిన్ననే భారత్ సమ్మిట్‌లో పాల్గొనాల్సి ఉన్నా, కశ్మీర్‌కు వెళ్లడం వల్ల రాలేకపోయానని తెలిపారు. పాతతరం నాయకత్వం అంతరించిపోయిందని, రాజకీయాల్లోకి కొత్త తరం రావాలని పిలుపునిచ్చారు. కొత్త తరం భాషను రాజకీయ నాయకులు అర్థం చేసుకోవాలని సూచించారు. కొత్త తరాన్ని ప్రోత్సహించాలి, యువ నేతలను తయారు చేయాలని రాహుల్ గాంధీ కోరారు.



**అన్ని వర్గాల ఆకాంక్షలు నెరవేర్చడమే మా లక్ష్యం : సీఎం రేవంత్**

గత పదేళ్లలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వంపై ప్రజలు అనేక ఆశలు పెట్టుకున్నారని పేర్కొన్నారు. సమాజంలోని అన్ని వర్గాల ఆకాంక్షలు నెరవేర్చడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు అనేక పథకాలు తీసుకొచ్చామన్నారు. దేశంలోనే అతిపెద్ద రుణమాఫీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. రైతులకు సుమారు రూ.20 వేల కోట్ల రుణమాఫీ చేశామని వివరించారు. రైతులకు 24 గంటలూ ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. రైతుభరోసా కింద రైతులకు ఎకరాకు రూ.12 వేలు ఇస్తున్నామని, వరికి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తున్నామని వెల్లడించారు. "పట్టభద్రులు సర్టిఫికెట్ తీసుకుంటున్నారు.. కానీ ఉద్యోగాలు లేవు. యువత కోసం రాజీవ్ యువ వికాసం పథకం తీసుకొచ్చాం. ప్రజలకు ఏ సమయంలో ఏది అవసరమో కాంగ్రెస్‌కు బాగా తెలుసు. విద్య, వైద్యం, ఉద్యోగాల కల్పనే మా అత్యున్నత ప్రాధాన్యత. రైతులు, మహిళలు, యువతకు మా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థలకు తెలంగాణ మహిళలు పోటీ ఇస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కోసం రూ.5 వేల కోట్లు ఖర్చు చేశాం. మూసీ పునరుజ్జీవనానికి సంకల్పించాం. 30 వేల ఎకరాల్లో వరల్డ్ క్లాస్ సిటీ నిర్మించబోతున్నాం." అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

# సీతమ్మసాగర్‌కు అనుమతి

## తెలంగాణ చరిత్రలో ల్యాండ్ మార్క్.. ఏడాదిన్నర కృషి ఫలించింది
## కాళేశ్వరం వాళ్ళే కట్టారు.. వాళ్ల హయంలోనే కూలింది
## నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్, మహా:** సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుకు కేంద్ర జలవనరుల శాఖ అనుమతి ఇచ్చిందని.. ఇది తెలంగాణ ఇరిగేషన్ చరిత్రలో లాండ్ మార్క్ డెవలప్‌మెంట్ అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం నాడు మీడియాతో మంత్రి మాట్లాడుతూ.. ఏడాదిన్నర కృషి ఫలించిందన్నారు. ఇరిగేషన్ శాఖలో ఇది ముందడుగని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులు చాలా కాలంగా గోదావరి జలాల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. గోదావరి నదీ జలాలలో 68 టీఎంసీలు.. 8 లక్షల ఎకరాలకు ఉపయోగమని చెప్పుకొచ్చారు. గత ప్రభుత్వంలో మేడిగడ్డ కూలిపోయిందని..సీతమ్మ సాగర్ నిలబడుతుందా అని కేంద్రం అడిగిందన్నారు. సీడబ్ల్యూసీకి అన్ని వివరాలు పంపితే అప్పుడు అప్రూవల్ ఇచ్చారని వెల్లడించారు. పోలవరం బ్యాక్ వాటర్ విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందన్నారు. ముంపు నష్టం.. ప్రొటెక్షన్ వాల్ కోసం కేంద్రం నిధులు ఇవ్వాలని అడిగామని.. అందుకు కేంద్రం కొంత అనుకూలంగా ఉందని తెలిపారు. కృష్ణా జలాల వాటాలో తెలంగాణ రైతులకు బీఆర్ఎస్ ద్రోహం చేసిందని విమర్శించారు. తెలంగాణకు ఎక్కువ భాగం ఇవ్వాలని ట్రిబ్యునల్ ముందు వాదిస్తున్నామన్నారు. అంతరాష్ట్ర సమస్యలపై ప్రభుత్వం సీరియస్‌గా వర్కౌట్ చేస్తోందన్నారు. ఎన్డీఎస్ఏ నివేదికపై బీఆర్ఎస్ మాట్లాడే తీరు ఖండిస్తున్నామన్నారు. తుమ్మిడిహెట్టి దగ్గర తాము ప్రాజెక్ట్ మొదలుపెట్టామని.. బీఆర్ఎస్ తమకు పేరు వస్తుందని రీడిజైన్ చేసి... లక్షన్నర కోట్లకు పెంచారని అన్నారు. కాళేశ్వరం కట్టిన డబ్బు బీఆర్ఎస్ వాళ్ళ జేబులో నుంచి కట్టలేదన్నారు. తెలంగాణ ప్రజల భవిష్యత్ తాకట్టు పెట్టి మరీ కట్టారని మండిపడ్డారు. వాళ్ళే కట్టారు.. వాళ్ల హయంలోనే కూలిందని అన్నారు.

**ఎన్‌డీఎస్ఏ రిపోర్ట్ లో దుర్మార్గాలు**

ఎన్‌డీఎస్ఏ రిపోర్ట్ చూస్తే ఎంత దుర్మార్గం చేశారో అర్థం అవుతోందని మంత్రి ఉత్తమ్ అన్నారు. ఎన్‌డీఎస్ఏ రిపోర్ట్‌లో విషయాలు తెలంగాణ ప్రజలు గుర్తించాలని అన్నారు. ప్రాజెక్టును తుమ్మిడిహెట్టి నుంచి షిఫ్ట్ చేసి అన్యాయం చేశారని..ద్రోహం చేశారని మండిపడ్డారు. మేడిగడ్డనే కాదు.. సుందిళ్ళ, అన్నారం కూడా ప్రమాదంలో ఉందని ఎన్‌డీఎస్ఏ చెప్పిందని తెలిపారు. లక్ష కోట్లు దోపిడి చేసిన వాళ్లకు ఎలాంటి శిక్ష వేయాలో ఆలోచించాలన్నారు. ఎన్‌డీఎస్ఏ నివేదిక ప్రకారం ముందుకు వెళ్తామని చెప్పారు. ఒకటి రెండు రోజుల్లో దీనిపై సమీక్ష చేస్తామన్నారు. బీఆర్ఎస్ లాగా చిల్లర ఆలోచనలు తమకు ఉండవన్నారు. 'మీ సభ ఎప్పుడూ ఉందో ఎన్‌డీఎస్ఏకు ఏం తెలుసు. అబద్ధపు మాటలు ఆపండి. ఎన్‌డీఎస్ఏ సూచనలే మేము నమ్ముతాం' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# భారత్-పాకిస్థాన్ యుద్ధం డేట్ ఫిక్స్

(మొదటిపేజీ తరువాయి)

పాక్‌లోని ఓ వార్తా ఛానెల్‌తో మాట్లాడుతూ భారత్.. పాకిస్థాన్‌పై ఎప్పుడు దాడి చేస్తుందో చెప్పారు. '' భారత్ నుంచి కచ్చితంగా ప్రతీకార చర్య ఉంటుందని నాకు ఎలాంటి సందేహం లేదు. ఎందుకుంటే భారత ప్రధాని మోదీ కూడా బిహార్‌లో చర్యలు తీసుకుంటామని ప్రకటన చేశారు. గతంలో పరిశీలిస్తే యూరీ, పుల్వామా దాడుల తర్వాత భారత్ చర్యలకు దిగిన సందర్భాలున్నాయి. యూరీ దాడి తర్వాత 89లో భారత్ చర్యలకు దిగింది. పుల్వామా దాడి తర్వాత 12 రోజుల్లోనే సర్జికల్ స్ట్రైక్ చేసింది. ఏప్రిల్ 22న పహల్గాంలో దాడి జరిగింది కాబట్టి.. మే మొదటి వారంలో లేదా మధ్యన భారత్ దాడి చేసే అవకాశం ఉందని'' అబ్దుల్ బాసిత్ అన్నారు. అంతేకాదు సింధు జల ఒప్పందాన్ని భారత్ రద్దు చేయడం గురించి ఆయన మాట్లాడారు. పాకిస్థాన్ నీళ్లు లేకుండా మనుగడ సాగించడం కష్టమవుతుందని అన్నారు. దీనివల్ల తమ ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని.. నదుల్లో నీరు ప్రవహించకపోతే రక్తం ప్రవహిస్తుందంటూ చెప్పుకొచ్చారు.

**యుద్ధానికి సిద్ధం.. ఇండియన్ ఆర్మీ సంచలన ప్రకటన**

పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్, పాక్ మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. పాకిస్థాన్‌తో ఏ క్షణమైన యుద్ధం జరగొచ్చనే ప్రచారం నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఇండియన్ ఆర్మీ ఎక్స్‌లో సంచలన పోస్ట్ చేసింది. ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాం అంటూ పేర్కొంటూ జవాన్లు విన్యాసం చేసే దృశ్యాలను షేర్ చేసింది. '' దేనికీ భయపడం, ఏదీ మమ్మల్ని ఆపలేదు, ఎప్పుడ సిద్ధమే అంటూ తెలిపింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మరోవైపు ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు తూర్పు నావికాదళం సిద్ధంగా ఉంది. ఈ నేపథ్యంలో విశాఖలో నేవీకి సన్‌రైజ్ ఫ్లీట్‌కు ఆదేశాలు జారీ అయ్యాయి. తూర్పు నావికాదళాధిపతి వైస్ అడ్మిరల్ పెందార్కర్ ప్రస్తుత పరిస్థితిని సమీక్షించారు. సముద్రమార్గంలో పెరుగుతున్న ఉద్రిక్తతలను దృష్టిలో పెట్టుకొని అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచనలు చేశారు.

# గులాబీ.. వరం..గల్

## పాతికేళ్ల పతాక

### నేడు భారీ సభ.. గులాబీ శ్రేణులన్నీ అదే బాట

### కేసీఆర్ ప్రసంగంపై ఆసక్తి



**వరంగల్, హైదరాబాద్ మహా:** ఓరుగల్లు సభను గులాబీపార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. పాతికేళ్ళ పార్టీకి, పోరాటపటిమకు ప్రతీకగా ఓరుగల్లు సభ నిలిపింది. పది లక్షలమందిని ఈ సభకు తరలించాలని బీఆర్ఎస్ లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్ర రాజకీయాల్లో వరంగల్ సభ సరికొత్త చరిత్రను సృష్టించబోతోందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఓరుగల్లు వేదికగా ఆదివారం జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ సందర్భంగా తెలంగాణ సబ్బండవర్గాల ప్రజలు లక్షలాదిగా తరలి రావాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ క్రమంలో రాష్ట్రంలోని పార్టీ ముఖ్యనేతలతో కేటీఆర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి ఉదయాన్నే గులాబీ జెండాలు ఆవిష్కరించి కదలిరావాలని సూచించారు. గులాబీ సభ కోసం తెలంగాణ వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుండి పెద్ద ఎత్తున కార్యకర్తలను తరలిస్తోంది. పార్టీ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జరుగుతున్న ప్రతిష్ఠాత్మక సభ కావడంతో సభకు హాజరయ్యే వారంతా గులాబీ రంగు దుస్తులు ధరించి రావాలని పార్టీ నేతలు పిలుపునిచ్చారు. చారిత్రక సభలో కేసీఆర్ గారి ప్రసంగంపై అన్ని వర్గాల్లో పెద్ద ఎత్తున ఆసక్తి నెలకొని ఉందని, రాష్ట్ర రాజకీయాల్లో ఈ సభ సరికొత్త చరిత్రను సృష్టించబోతోందని కేటీఆర్ స్పష్టం చేశారు. ఇప్పటికే వరంగల్ దారులన్నీ గులాబీనేతలతో కిటకిటలాడుతున్నాయి.

# దందాలతోనే కవిత ఫేమస్

## ఆమె పెద్ద రౌడీ కాబట్టే.. అలా

### కేసీఆర్ కుటుంబం దొంగల ముఠాలా దోచుకుంది

### విరుచుకుపడ్డ పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్



**మహా :** దందాలతోనే కవిత దేశవ్యాప్తంగా ఫేమస్ అయ్యారని, లిక్కర్ దందాలు చేసే కవితకు రాహుల్ గాంధీ పేరు ఎత్తే నైతిక అర్హత లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ విమర్శించారు. శనివారం ఒక ప్రకటనలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై ఆయన తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.. కవిత ఒక రౌడీ కాబట్టే ఆమె బహిరంగంగా చెప్పుకుంటున్నారని ఆయన వ్యాఖ్యానించారు. కేసీఆర్ కుటుంబం దోపిడీకి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని మహేష్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ నిర్వహించబోయే రజతోత్సవ సభ టీఆర్ఎస్ కోసమా లేక బీఆర్ఎస్ కోసమా అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కులగణన, ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రాహుల్ గాంధీ ఆలోచనల మేరకే జరిగాయని స్పష్టం చేశారు. వరంగల్ డిక్లరేషన్‌లో పేర్కొన్న విధంగా రైతులకు రుణమాఫీని రాహుల్ గాంధీ మాట ప్రకారమే చేశామని తెలిపారు.. గాంధీ కుటుంబం త్యాగాలకు పెట్టింది పేరని కొనియాడారు. కేసీఆర్ కుటుంబం దొంగల ముఠాలా తెలంగాణను దోచుకుందని ఆయన ఆరోపించారు. హెచ్‌సీయూ భూముల గురించి కవిత మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఆయన అన్నారు. అస్తిత్వం నిలుపుకోవడం కోసమే కేసీఆర్ అండ్ కో ఆరాటపడుతున్నారని ఆయన విమర్శించారు.



## తెలంగాణలో వర్షాలు

**హైదరాబాద్, మహా:** తెలంగాణలో ఆదివారం తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కరీంనగర్, ములుగు,పెద్దపల్లి, ఆదిలాబాద్, మంచిర్యాల, జగిత్యాల, జయశంకర్ భూపాల్ పల్లి, నిర్మల్, సిరిసిల్ల, నిజామాబాద్ జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ జిల్లాల్లో 50 నుండి 60 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని అంచనా వేసింది. ఇక ఖమ్మం, హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.



హైదరాబాద్‌లో జరుగుతున్న భారత్ సమ్మిట్‌లో భాగంగా ఏర్పాటైన ఎగ్జిబిషన్‌లో శనివారం చర్కాపై నూలు వడుకుతున్న రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

# పేదలు వేసుకున్న గుడిసెలు కాలిపోయినయ్

## కుంట్లూర్ భూదాన్ లో 500 గుడిసెలు బూడిద, రోడ్డున పడ్డ పేదలు

### కాలిన వంట సామగ్రి, నగదు, పిల్లల పుస్తకాలు

### అందరూ పనులకు వెళ్లడంతో తప్పిన ప్రాణ నష్టం.. కుంట్లూరులోని రావినారాయణరెడ్డి కాలనీలో ప్రమాదం

### ప్రమాదాన్ని పరిశీలించిన రాచకొండ సీపీ సుధీర్ బాబు, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



**ఎల్బీనగర్,మహా:** రంగారెడ్డి జిల్లా పెద్దఅంబర్ పేట్ మున్సిపాలిటీలోని కుంట్లూర్ శివారులోని రావినారాయణ రెడ్డి కాలనీ సమీపంలో ఉన్న గుడిసెలలో శనివారం మధ్యాహ్నం వేళ భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకున్నది. రావినారాయణరెడ్డికాలనీలోని సుమారు 100ఎకరాల భూదాన్ భూమిలో సిపిఐ ఆధ్వర్యంలో పేదలు 8వేల గుడిసెలు వేసుకొని, కూలీ పనులు చేసుకుంటూ వేలాది మంది నివసిస్తున్నారు. బతుకుదెరువు కోసం కూలీ పనులకు వెళ్లగా,శనివారం మధ్యాహ్న సమయంలో ప్రమాదవశాస్తు నిప్పంటుకుని మంటలు చెలరేగాయి. వందలాది గుడిసెలు క్షణల్లో కాలి బూడిదయ్యాయి. గుడిసెల్లో ఉన్న గ్యాస్ సిలిండర్లు పేలడంతో మంటలు పెద్ద ఎత్తున చెలరేగాయి. మంటలు చెలరేగడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. గుడిసెలన్నీ పక్కపక్కనే ఉండడంతో మంటలు త్వరగా వ్యాపించారు. సుమారు 500 గుడిసెలు కాలిపోయాయి. కూలీలు పనులకు వెళ్లడంతో ప్రాణ నష్టం జరగలేదు. గుడిసెలు కాలిపోవడంతో అనేక మంది పేదలు నిరాశ్రయులయ్యారు. సమాచారం అందుకున్న హయత్ నగర్ అగ్నిమాపక సిబ్బంది నాలుగు ఫైరింజన్లతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. ప్రమాదంతో పేదలు కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. అగ్నిప్రమాదంలో నగదు, దుస్తులు, వంటసామగ్రి, పిల్లల పుస్తకాలు కాలి బూడిదయ్యాయి.చాలా మంది నిరాశ్రయులుగా మారారు. సమాచారం తెలుసుకున్న ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్, అదనపు డీసీపీ కోటేశ్వరరావు, ఏసీపీ కాశిరెడ్డి, సరూర్ నగర్, వనస్థలిపురం, హయత్ నగర్, అబ్దుల్లాపూర్ మెట్ సీఐలు సైదిరెడ్డి, శ్రీనివాస్, నాగరాజుగౌడ్, అంజిరెడ్డి ఆధ్వర్యంలో ఎస్సైలు, సిబ్బంది వచ్చి, పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అగ్నిప్రమాదంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు హయత్ నగర్ సీఐ నాగరాజుగౌడ్ తెలిపారు.

**జాగ కోసం ఏండ్లకు ఏండ్లు ఎదురుచూపు**

కుంట్లూరు రెవెన్యూ పరిధిలోని రావినారాయణరెడ్డి కాలనీలో ఉన్న ప్రభుత్వ భూమిలో సుమారు వేల మంది పేదలు గుడిసెలు వేసుకుని, ఇంటి జాగ కోసం నాలుగేండ్లుగా ఎదురు చూస్తున్నారు. పాలకులు తమను కరుణిస్తారని వేలాది మంది పేదలు ఎదురు చూస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం న్యాయం చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమను ఆదుకుని, ఇంటి జాగ ఇవ్వాలని పేదలు కోరుతున్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీస్ ఉన్నతాధికారులు, నాయకులు రావినారాయణరెడ్డి కాలనీలో అగ్నిప్రమాదం జరిగిందని సమాచారం తెలుసుకున్న పోలీసుల ఉన్నతాధికారులు, రాజకీయ పార్టీల నాయకులు ప్రమాదాన్ని పరిశీలించి, బాధితులను పరామర్శించారు. రాచకొండ సీపీ సుధీర్ బాబు వెంటనే ప్రమాద స్థలానికి చేరుకుని. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ఒక గుడిసెలో దేవుడి దగ్గర పెట్టిన దీపం గుడిసెకు అంటుకుని, మంటలు చెలరేగాయని, గుడిసులన్నీ పకపక్కనే ఉండడంతోపాటు గ్యాస్ సిలిండర్లు పేలడంతో భారీగా మంటలు వచ్చాయని ప్రాథమిక అంచానకు వచ్చినట్లు తెలిపారు. జరిగిన ప్రమాదం దురదృష్టకరమని, అగ్నిప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అగ్నిప్రమాదంపై విచారణ చేయించాలి సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి రావినారాయణరెడ్డి కాలనీ అగ్నిప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని, జరిగిన ప్రమాదం విచారణ చేపట్టాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర నాయకుడు ఆందోజు రవీంద్రాచారి డిమాండ్ చేశారు. ఈ ఘటన ప్రమాదవశాస్తు జరిగిందా? లేదా ఏదైనా కుట్ర కోణం ఉందా? అని సందేహం వ్యక్తం చేస్తూ పోలీసులు పూర్తిస్థాయి విచారణ, దర్యాప్తు చేపట్టాలని కోరారు. ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే పేదలు రోడ్డున పడ్డాడని ఆరోపించారు. ప్రభుత్వ భూమిని పేదలకు ఇవ్వాలని కోరారు. గ్యాస్ సిలిండర్ లు పేలడంతో పరుగులు తీసిన జనం. ఘటన స్థలం వద్ద అగ్నిప్రమాదం సమయంలో గుడిసెలలో వంట కోసం ఏర్పాటు చేసుకున్న గ్యాస్ సిలిండర్ లు బ్లాస్ట్ అయ్యాయి.దీంతో మంటలను ఆర్పేందుకు కూడా స్థానికులు భయాందోళనకు గుర్రై అక్కడి నుండి పరుగులు తీశారు.

# పాకిస్తాన్ కొడుకులకు కామన్ సెన్స్ లేదు

## కశ్మీర్ ఇండియాదే.. కశ్మీరీలు మనోళ్లే

## ఉగ్రదాడిపై రెచ్చిపోయిన విజయ్ దేవరకొండ



**మహా :** జమ్మూకశ్మీర్ పెహల్గాంలో జరిగిన ఉగ్రదాడిపై ప్రముఖ నటుడు విజయ్ దేవరకొండ కీలక వ్యాఖ్యలు చేశారు. తమిళ నటుడు సూర్య హీరోగా తెరకెక్కిన రెట్రో మూవీ ప్రీరిలీజ్ ఫంక్షన్ ఇవాళ హైదరాబాద్‌లో జరిగింది. ఈ ఈవెంట్‌కు విజయ్ దేవరకొండ చీఫ్ గెస్ట్‌గా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ.. 'ఆ పాకిస్తానీ కొడుకులకు సరైన ఎడ్యుకేషన్ ఉంటే ఇలాంటి పరిస్థితి ఉండేది కాదు. ఈ పనికిమాలిన దాడలకు దిగేవారు కాదు. ఎవడెంత హడావిడి చేసినా డోంట్ కేర్.. కశ్మీర్ ఇండియాదే.. కశ్మీరీలు మనోళ్లే. రెండేళ్ల క్రితం ఖుషీ మూవీ షూటింగ్ అక్కడే చేశాను. కశ్మీర్‌తో నాకు చాలా మంచి అనుభవాలు ఉన్నాయి. ఆ ప్రజల ప్రేమను ఇంకా మర్చిపోలేకపోతున్నాను. పాకిస్తాన్ కొడుకులు ముందు వాళ్ల పాలన సరిచేసుకోవడం మీద దృష్టి పెడితే బెటర్. ఎంతోమంది పాకిస్తాన్ ప్రజలు తిండి లేక, కరెంట్ లేక ఇబ్బందులు పడుతున్నారు. అసలు పాకిస్తాన్ మీద మనం అటాక్ చేయాల్సిన పనేలేదు. పాకిస్తాన్ ప్రజలకే విరక్తి వచ్చి.. వాళ్ల ప్రభుత్వం మీద అటాక్ చేస్తరు. అసలు పాకిస్తాన్ వాళ్లకు కామన్ సెన్స్ లేదు. ఇలాంటి సమయాల్లో మనందరం ఐక్యంగా ఉండాలి' అంటూ విజయ్ దేవరకొండ రెచ్చిపోయారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇది గమనించిన ఫ్యాన్స్.. విజయ్‌ను ఆకాశానికెత్తేస్తున్నారు.

# భూ వివాదాలను పరిష్కరించి రైతులకు న్యాయం చేయడమే లక్ష్యంగా భూభారతి

## భూ భారతి చట్టం ద్వారా భూ సంబంధిత సమస్యలకు శాశ్వత పరిష్కారం


### ధరణితో సాధ్యం కానీ భూ సమస్యలను భూభారతి ద్వారా పరిష్కరించుకోవచ్చు

### పరకాల శాసన సభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి



**పరకాల, మహా :** భూ వివాదాలను పరిష్కరించి రైతులకు న్యాయం చేయడమే లక్ష్యంగా భూభారతి చట్టాన్ని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిందని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. శనివారం పరకాల నియోజకవర్గ దామెర మండల కేంద్రంలో ఏఎన్ఆర్ గార్డెన్స్ నందు ప్రజాపాలన ప్రగతి బాట భూభారతి చట్టం, భూ పోర్టల్ పై నిర్వహించిన అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య , అధికారులతో కలిసి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం సదస్సుకు హాజరైన రైతులకు భూభారతి చట్టంవిధి విధానాలు వివరించారు. రైతులు, ప్రజలు లేవనెత్తే సందేహాలకు వారికి అర్ధమయ్యేలా అధికారులు సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూ సమస్యలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలన్న లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని అన్నారు. భూభారతి చట్టం ప్రయోజనాలు సామాన్య ప్రజలకు చేరినప్పుడే దానికి సార్ధకత ఏర్పడుతుందని అన్నారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి దేశానికే రోల్ మోడల్ అని అన్నారు.గత పది సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ వల్ల నష్టపోయిన లక్షలాదిమంది ప్రజల మేరకు, రైతులు విజ్ఞప్తుల మేరకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో భాగంగా ధరణి పోర్టల్ తొలగించి భూభారతి చట్టాన్ని రూపొందించడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని 4 మండలాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ చట్టం అమలు చేస్తున్నారని, తదుపరి భూములకు సంబంధించిన సమస్యలపై రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు.

# ట్రంప్ రిలీఫ్.. తగ్గిన పెద్దన్న



**మహా:** ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లి బహిష్కరణ ముప్పు ఎదుర్కొంటున్న వందల మంది విద్యార్థులకు భారీ రిలీఫ్‌దక్కింది. వారి వీసాలు, చట్టబద్ధ హోదాను రద్దు చేస్తూ ఇటీవల తీసుకున్న నిర్ణయంపై ట్రంప్ యూటర్న్ తీసుకున్నారు. ఆ విద్యార్థుల లీగల్ స్టేటస్‌ను పునరుద్ధరించారు. ఈమేరకు అమెరికా ప్రభుత్వానికి చెందిన ఓ న్యాయవాది తాజాగా వెల్లడించారు. అక్రమ వలసదారులపై కఠినంగా వ్యవహరిస్తున్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. విదేశీ విద్యార్థులపైనా ఉక్కుపాదం మోపిన సంగతి తెలిసిందే. ఈక్రమంలోనే వివిధ కారణాలతో 187 కాలేజీలకు చెందిన 1,200 మందికి పైగా విదేశీ విద్యార్థుల వీసా లేదా వారి చట్టబద్ధ హోదాలను రద్దు చేసింది. దీనిపై విద్యార్థులు న్యాయస్థానాలను ఆశ్రయించారు. కాలిఫోర్నియా, బోస్టన్ కోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన ఆయా న్యాయస్థానాలు.. విద్యార్థుల వీసా రద్దును ఆపాలంటూ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ క్రమంలోనే ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్.. ఆయా విద్యార్థుల చట్టబద్ధ హోదాను తాత్కాలికంగా పునరుద్ధరించింది.

# జమ్మూకశ్మీర్‌లో లోకల్ టెర్రరిస్టుల అరాచకం

## పాక్ ఉగ్రవాదులకు గ్రౌండ్ లెవల్ సహకారం

### చొరబాటుదారులకు ఆశ్రయం

### 14 మంది స్థానిక ఉగ్రవాదుల వివరాలతో జాబితా విడుదల



**మహా:** జమ్మూకశ్మీరులోని పహల్గామ్‌లో ఉగ్రదాడి తర్వాత హైటెన్షన్ నెలకొంది. భద్రతపై తీవ్ర ఆంఓళన నెలకొంది. ఈతరుణంలో భారత నిఘా సంస్థలు కీలక జాబితాను విడుదల చేశాయి. జమ్మూకశ్మీర్ పరిధిలో చురుగ్గా కార్యకలాపాలు నిర్వహిస్తున్న 14 మంది స్థానిక ఉగ్రవాదుల వివరాలను ఆ జాబితాలో పొందుపరిచారు. నిఘా వర్గాల సమాచారం ప్రకారం ఈ స్థానిక ఉగ్రవాదులంతా 20 నుంచి 40 ఏళ్లలోపు వారే. పాకిస్తాన్ నుంచి జమ్మూకశ్మీరులోకి చొరబడే ఉగ్రవాదులందరికీ రవాణాపరమైన, వసతిపరమైన ఏర్పాట్లన్నీ వీళ్లే చేస్తున్నారు. పాక్ ఉగ్రవాదులకు గ్రౌండ్ లెవల్‌లో సహాయ సహకారాలను అందించడంలో కశ్మీరులోని ఈ 14 మంది టెర్రరిస్టులే ముఖ్యపాత్ర పోషిస్తున్నారని నిఘా వర్గాలు అంటున్నాయి. 'ఈ స్థానిక ఉగ్రవాదులకు పాకిస్తాన్‌కు చెందిన హిజ్బుల్ ముజాహిదీన్, లష్కరే తైబా, జైషే మహ్మద్‌లతో లింకులు ఉన్నాయి. తాజాగా విడుదల చేసిన జాబితాలోని 14 మందిలో ముగ్గురికి హిజ్బుల్ ముజాహిదీన్‌తో, ఎనిమిది మందికి లష్కరే తైబాతో, ముగ్గురికి జైషే మహ్మద్‌తో సంబంధాలు ఉన్నాయి' అని వెల్లడించాయి.

**14 మంది స్థానిక ఉగ్రవాదుల జాబితా**

నిఘా వర్గాలు విడుదల చేసిన జాబితాలోని 14 మంది స్థానిక ఉగ్రవాదుల్లో ఆదిల్ రెహమాన్ డెంటూ (21), ఆసిఫ్ అహ్మద్ షేక్ (28), అహ్సాన్ అహ్మద్ షేక్ (23), హారిస్ నజీర్ (20), ఆమిర్ నజీర్ వాని (20), యావర్ అహ్మద్ భట్, ఆసిఫ్ అహ్మద్ ఖండే (24), నసీర్ అహ్మద్ వాని (21), షాహిద్ అహ్మద్ కుటాయ్ (27), ఆమిర్ అహ్మద్ దార్, అద్నాన్ సఫీ దార్, జుబైర్ అహ్మద్ వాని (39), హారూన్ రషీద్ గనై (32), జాకీర్ అహ్మద్ గనీ (29) ఉన్నారు.

**లోకల్ టెర్రరిస్టుల నేపథ్యమిదీ**

- ఆదిల్ రెహమాన్ డెంటూ 2021లో లష్కరే తైబాలో చేరాడు. ఆ సంస్థలో సోపోర్ జిల్లా కమాండర్‌గా పనిచేస్తున్నాడు
- ఆసిఫ్ అహ్మద్ షేక్ జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ తరఫున అవంతీపొర జిల్లా కమాండర్‌గా ఉన్నాడు. 2022 నుంచి ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గొంటున్నాడు
- అహ్సాన్ అహ్మద్ షేక్ పుల్వామాలో లష్కరే తైబా ఉగ్రవాదిగా కార్యకలాపాలు సాగిస్తున్నాడు. 2023 నుంచి ఉగ్రవాద కార్యకలాపాల్లో ఉన్నాడు
- హారిస్ నజీర్ పుల్వామా ప్రాంత ఉగ్రవాది. అతడు 2023 నుంచి లష్కరే తైబాలో పనిచేస్తున్నాడు
- అమీర్ నజీర్ వాని 2024 నుంచి పుల్వామాలో జైషే మహ్మద్ ఉగ్రవాదిగా కార్యకలాపాలు సాగిస్తున్నాడు
- యావర్ అహ్మద్ భట్ 2024 నుంచి పుల్వామాలో జైషే మహ్మద్ ఉగ్రవాదిగా ఉన్నాడు
- ఆసిఫ్ అహ్మద్ ఖండే జమ్మూ కశ్మీర్‌లోని షోపియన్ జిల్లాకు చెందిన ఉగ్రవాది. ఇతడు 2015 జూలైలో హిజ్బుల్ ముజాహిదీన్‌లో చేరాడు
- నసీర్ అహ్మద్ వాని 2019 నుంచి షోపియన్‌లో ఉగ్రవాద కార్యకలాపాలు సాగిస్తున్నాడు
- షాహిద్ అహ్మద్ కుటే 2023 నుంచి లష్కరే తైబా తరఫున షోపియన్‌లో ఉగ్రవాదిగా వ్యవహరిస్తున్నాడు. ఇతడికి లష్కరే అనుబంధ సంస్థ ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్)తోనూ సంబంధాలు ఉన్నాయి
- అమీర్ అహ్మద్ దార్ 2023 నుంచి లష్కరే తైబా తరఫున షోపియన్‌లో పనిచేస్తున్నాడు. విదేశీ ఉగ్రవాదులకు సహాయకుడిగా ప్రధాన పాత్ర పోషిస్తున్నాడు
- షోపియన్ జిల్లా వాస్తవ్యుడైన అద్నాన్ సఫీ దార్ 2024 నుంచి లష్కరే తైబా, టీఆర్ఎఫ్ కోసం పనిచేస్తున్నాడు. పాకిస్తాన్ హ్యాండ్లర్ల నుంచి ఉగ్రవాదులకు సమాచారం చేరవేస్తున్నాడు.
- జుబైర్ అహ్మద్ వాని అలియాస్ అబూ ఉబైదా అలియాస్ ఉస్మాన్.. ఉగ్రవాద సంస్థ హిజ్బుల్ ముజాహిదీన్ చీఫ్ ఆపరేషనల్ కమాండర్‌గా పనిచేస్తున్నాడు. జమ్మూ కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో ఇతడు కార్యకలాపాలు సాగిస్తున్నాడు. ఇతగాడు ఏ+ యాక్టివ్ టెర్రరిస్టు. 2018 నుంచి జమ్మూకశ్మీరులో భద్రతా దళాలపై జరిగిన దాడుల్లో ఇతడి ప్రమేయం ఉంది
- హారూన్ రషీద్ గనై అనంత్‌నాగ్ జిల్లా వాస్తవ్యుడు. ఇతడు హిజ్బుల్ ముజాహిదీన్ తరఫున పనిచేస్తున్నాడు
- 2018లో పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ కు వెళ్లి ఉగ్రవాద శిక్షణ పొందాడు. ఇటీవలే దక్షిణ కాశ్మీర్‌కు తిరిగి వచ్చాడని తెలుస్తోంది
- జుబైర్ అహ్మద్ గని జమ్మూ కశ్మీర్‌లోని కుల్గామ్ జిల్లా వాస్తవ్యుడు. ఇతడికి లష్కరే తైబాతో సంబంధం ఉంది. భద్రతా దళాలపై దాడి ఘటనల్లో ఇతడి ప్రమేయం ఉంది

# కేసీఆర్‌కు ముప్పు

## కాళేశ్వరం ప్రాజెక్ట్ డబ్బుతోనే ప్లీనరీ సభ

## బీజేపీ ఎంపీ అరవింద్ సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్, మహా:** హైదరాబాద్: మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబంపైన నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ సంచలన కామెంట్స్ చేశారు. కేసీఆర్‌కు ఆయన కుటుంబ సభ్యుల నుంచి ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందుకే గత కొన్నేళ్లుగా కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో ఉంటున్నారని అన్నారు. అందరు ఒకే దగ్గర ఉంటే తనను కుటుంబ సభ్యులే చంపే అవకాశం ఉందనే భయంతో కేసీఆర్ దూరంగా ఉంటున్నారని ఎంపీ ధర్మపురి అరవింద్ షాకింగ్ కామెంట్స్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో ఎంపీ ధర్మపురి అరవింద్ మీడియాతో మాట్లాడారు. కన్న బిడ్డలు ఆయనను కలవాలన్న ముందుగా అపాయింట్మెంట్ ఉండాల్సిందేనని ఎంపీ ధర్మపురి అరవింద్ చెప్పారు. మాజీ మంత్రి కేటీఆర్‌పై అరవింద్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి అక్రమాలపై టెక్నికల్ రిపోర్ట్‌ను మీడియాకు ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా వచ్చిన డబ్బుతోనే ప్లీనరీ సభ పెడుతున్నారని అరవింద్ ఆరోపించారు. కేసీఆర్ కుటుంబం, అప్పటి ఇరిగేషన్ మంత్రిపైన సీబీఐ , ఈడీ విచారణ జరిపి జైల్లో పెట్టాలని అన్నారు. కేసీఆర్ కంటే రేవంత్‌రెడ్డి అత్యంత డేంజర్ అని విమర్శలు చేశారు.

EDITORIAL
సంపాదకీయం

# దేశం తర్వాతే ఎవరైనా..

కశ్మీర్‌లో ఉగ్రవాదం కోరలు పీకామని, ఇక అక్కడేం చేయలేక జమ్మూ ప్రాంతంలో మిలిటెంట్లు తమ ప్రతాపాన్ని చూపిస్తున్నారని జమ్మూ, కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా అన్న కొన్ని రోజులకే దారుణం జరిగింది. ఉగ్రవాదం ఎప్పుడు పడగవిప్పి బుసలు కొడుతుందో అంచనా వేయటం సులభం కాదు. పహల్గాం దాడి నేపథ్యమలో దేశమంతా ఏకమై మోదీ వెనుక నిలబడింది. సింధూ నదీజలాల ఒప్పందం నిలిపివేతను పాకిస్తాన్ ఊహించలేదు. ఇరు దేశాల మధ్య యుద్ధం వచ్చిన సందర్భాల్లో... ముంబైపై ఉగ్రదాడి జరిగినప్పుడు, పుల్వామాలో మన జవాన్లను ఉగ్రవాదులు పొట్టనబెట్టుకున్నప్పుడు కూడా మన దేశం ఆ ఒప్పందం నిలిపివేత గురించి మాట్లాడలేదు. సింధూ నదీజలాలపై పాకిస్తాన్ సాగునీటిరంగం 80 శాతం వరకూ ఆధారపడి వుంటుంది. ప్రపంచంలో తీవ్రమైన నీటికొరతను ఎదుర్కొనే దేశాల్లో పాకిస్తాన్ ఒకటి. ప్రభుత్వం ఒక చర్య తీసుకునే ముందు ఎన్నో బేరీజు వేసుకోవాల్సి వుంటుంది. అది యుద్ధంగా మారిన పక్షంలో... మనవైపు గట్టిగా నిలబడే వారెవరు, వ్యూహాత్మకంగా ఎదురయ్యే సమస్యలేమిటి, దళాల సంసిద్ధత, సాంకేతిక సామర్థ్యాల్లో మన స్థానం ఏమిటి అనేవి చూసుకోవాలి. అందుకే ఆలస్యమైనా మోదీ కొట్టే దెబ్బ గట్టిగా ఉంటుందని దేశం భావిస్తోంది. కోరుకుంటోంది.


కంది రామచంద్రారెడ్డి
వీకెండ్ అనాలసిస్

**- తాజా రాజకీయ పరిణామాలపై ఎఎన్ఎన్ సీఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్**

భూతల స్వర్గం కాశ్మీరం రక్తసిక్తం అయింది. భారత భూభాగంలోకి చొరబడి.. మన పౌరులను దారుణంగా కాల్చి , నిలదీసిన ప్రజలను మీ ప్రధానికి చెప్పుకోపో అనేంత ధైర్యం ఆ ఉగ్రవాదులకు ఎక్కడిది? ఆనందంతో విహారానికి వెళ్ళిన కుటుంబాల్లో విషాదం నింపి, మన ప్రధాని పేరెత్తిన ముష్కరుల గుండెలు చీల్చాలని.. భవిష్యత్తులో ఇలాంటి దుస్సాహాలు జరగకుండా, కనీసం భారత్ పేరెత్తకుండా కఠినంగా శాస్తి చేయాలని దేశం కోరుకుంటోంది. ఈ దుర్ఘటన కేవలం ఓ ఉగ్రవాద దాడిగా కాదు, ఇది భారతదేశ ప్రజాస్వామ్యాన్ని, ఆర్థికాభివృద్ధిని లక్ష్యంగా చేసుకున్న కుట్రగా భావించాలి. ప్రధాని మోదీ వెంట రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా దేశమంతా నిబడింది. మోదీజీ మీరేం చేసినా మీ వెంటుంటాం అని దేశం అంటోంది. ఇపుడు దేశమంతా ఒకటే కోరుకుంటోంది. పాకిస్థాన్ కు బుద్ధిచెప్పాలి. ఈసారి గట్టిగా చెప్పాలి. భవిష్యత్తులో కశ్మీర్ గురించి, ఉగ్రవాదం గురించి మాట్లాడకుండా చెప్పాలి అని దేశప్రజలంతా కోరుకుంటున్నారు. ప్రపంచమంతా గ్లోబలైజేషన్ తో ప్రగతి వైపు పయనిస్తుంటే సరిహద్దు గీతలు మతం గోడలతో పాకిస్తాన్ చిల్లర రాజకీయాలతో అక్కడి పాతిక కోట్ల ప్రజలను కూడా మోసం చేస్తోంది. పాకిస్థాన్ కంటే తక్కువ జనాభా ఉన్న దేశాలు, పేదరికం ఉన్న దేశాలు ఎంతో ముందుకు వెళ్తుంటే పాకిస్థాన్ మాత్రం ఉగ్రవాదుల ఫ్యాక్టరీగా మారి మూర్ఖంగా, ప్రపంచానికి ముప్పుగా మారింది. పాకిస్థాన్ లా తొందరపడకుండా.. మోదీ ముప్పేటదాడికి రంగం సిద్ధం చేస్తున్నారు. సింధు జలాల ఒప్పందం రద్దు ద్వారా పాకిస్థాన్ కు చుక్క అందకుండా చుక్కలు చూపిస్తున్నారు. ఇది సంచలనమే. బుల్లెట్ వాడకుండా.. గొంతునులమడం లాంటిదే సింధుజలాల ఒప్పంద రద్దు. భారత్ కు ప్రపంచమంతా అండగా ఉంది. దుశ్చర్యకు దిగడమే కాకుండా.. పాకిస్థాన్ ప్రధాని కవ్వింపు మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయి.

పహల్గామ్ కేవలం ఓ పర్యాటక కేంద్రంగా మాత్రమే కాకుండా, అమర్నాథ్ యాత్ర మార్గంలో కీలకమైన బేస్ క్యాంపు. ఏడాది పొడవునా దేశీయ, విదేశీ పర్యాటకులతో కిటకిటలాడే ఈ ప్రాంతం లక్షలాది ప్రజలకు జీవనోపాధిని కలిగిస్తుంది. ఇటువంటి ప్రాంతంలో ఉగ్రదాడి జరగడం వెనుక వ్యూహాత్మక లక్ష్యం కనబడుతోంది . ఆర్టికల్ 370 రద్దు తరువాత కశ్మీర్ లోయలో పర్యాటక అనుకూల పరిస్థితులు నెలకొన్నాయి ..కానీ కొందరు స్థానికులు 370 రద్దు ను వ్యతిరేకంచారు . తమ ప్రాంతంలో దేశం లోని ఇతర ప్రాంతాల వారు వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు జరపడం, ఆస్తులను కలిగి ఉండటం పట్ల వారికి అభ్యంతరాలున్నాయి. ఇందులోంచి పుట్టిన వేదికే 'ద రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్). లష్కరే తోయిబా వంటి పలు ఉగ్ర సంస్థల సభ్యులను తీసుకుని భౌతిక గ్రూపుగా ఏర్పాటైంది. దీని వెనుక పాకిస్థాన్ హస్తం ఉంది. పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐనే టీఆర్ఎఫ్‌ను సృష్టించిందని కథనాలు వెలువడుతున్నాయి. ఓ వైపు దేశంలో పెట్రోల్ కొనడానికి పైసలు లేవు గానీ ఇక యుద్ధమేం చేస్తాం అని సామాన్య పాకీస్థాన్ లు తమ ఇబ్బందులపై మాట్లాడుతుంటే, పాకిస్థాన్ ప్రధాని పాలకులు మాత్రం కశ్మీర్ పై చిల్లర మాటలు మాట్లాడుతున్నారు. పాకిస్థాన్ మరోసారి ఇటువైపు చూడకుండా చేయాలన్న పట్టుదల ఇటు భారతీయులకే కాదు పాకిస్థాన్ సామాన్యప్రజల్లో కూడా కనబడుతోంది. ఆర్థికంగా కుదేలై అతలాకుతలమవుతున్నా పాకిస్థాన్ వక్రబుద్ధి మారడం లేదు ..దశాబ్దాలు గడుస్తున్నా కశ్మీర్ ను ఇంకా పరిష్కారం కాని ఒక సమస్యగా ప్రపంచానికి చూపే కుట్రలను కొనసాగిస్తున్నది. ఇది ఇప్పటికైనా అంతం కావాలి. భయాన్ని వ్యాపింపచేసేందుకు, హింసాకాండను రగిలించేందుకు కశ్మీరీ యువకులకు ఆయుధాలు, శిక్షణ ఇవ్వడాన్ని పాకిస్థానీ దుష్ట రాజ్యవ్యవస్థ కొనసాగిస్తున్నప్పుడు 'సాధారణ పరిస్థితుల' దిశగా కశ్మీర్ ఎలా పురోగమిస్తుంది? సమాజంలో విభజనకు ప్రయత్నిస్తున్న పాకిస్థాన్ దుష్ట పన్నాగాలను మనం ముందస్తుగా ఎదుర్కోవాలి. పాకిస్థాన్ తన పైశాచిక చర్యలకు భారీ మూల్యం చెల్లించి తీరాలి. ఏమాత్రం అలక్ష్యం లేకుండా కశ్మీరీ సమస్యకు చిత్తశుద్ధితో పరిష్కారం చూడాలి. తెలంగాణ రాష్ట్రసమితి బిఆర్ఎస్ గా మారినా.. ఇపుడు రజతోత్సవ సంబరం పేరుతో భారీ సభ నిర్వహిస్తోంది. ఓ వైపు ఉగ్రదాడులు, భారత్ పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు, ఇంకో వైపు కర్రెగుట్టల్లో మారణహోమానికి మావోలను చుట్టుముట్టిన కేంద్ర బలగాలు.. ఇంకోవైపు కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ నివేదిక.. ఇవన్నీ ఇలా ఉన్నా అసెంబ్లీ ఎన్నికకు మరో మూడున్నరేళ్ళు. ఇలాంటి పరిస్థితుల్లో కేసీఆర్ ఓ సభ నిర్వహించి ప్రజలను మెప్పించడం పెద్ద సవాలే. బిఆర్ఎస్ తొందరపాటుకు, అర్జంట్ గా అధికారం దక్కించుకోవాలన్న ఆత్రుతకు ఈ కార్యక్రమం అద్దం పడుతోందన్న వాదనలున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రతీ పార్టీకి గెలుపు ఓటములు ఉంటాయి. తిరిగి ప్రజల విశ్వాసాన్ని పెంచుకునేందుకు నిర్మాణాత్మకంగా వ్యవహరించాలి. చేసిన తప్పులను సమీక్షించుకుంటూ సరిదిద్దు కోవాలి. కానీ గులాబీపార్టీ వ్యవహారం విభిన్నంగా ఉంది. ఎన్నికలకు ముందు సర్వేల్లో వందకు పైగా సీట్లొస్తాయని చెప్పినట్లే, ఇపుడు మళ్ళీ ఏడాదికే వందరాగం అందుకున్నారు. బీఆర్ఎస్ పార్టీకి కేసీఆరే బ్రాండ్. మరో మూడున్నరేళ్ళ సమయం ఉంది. ఇప్పటినుండి భారీ ఖర్చులతో సభలు పెట్టి ప్రజలకు కానీ, క్యాడర్ కు కానీ అందించే ప్రయోజనాలు ఏంటో ఆ పార్టీ పెద్దలకు, వ్యూహరచనా టీమ్ కు తెలియాలి. కాళేశ్వరంపై ఎన్ డిఎస్ ఏ నివేదిక సంచలనంగా మారింది. మూడేళ్ళలో కట్టిన కాళేశ్వరం.. మూడేళ్ళకే కూలిందని, ప్రపంచంలో ఇది ఎనిమిదవ వింత అని కాంగ్రెస్ మంత్రులు అంటున్నారు. గత ఏడాది లోక్ సభ ఎన్నికల కోసం తెలంగాణ వ్యాప్తంగా ప్రచారం నిర్వహించిన కేసీఆర్ ఇపుడు మళ్ళీ వరంగల్ సభ ద్వారా ప్రజల ముందుకు నేరుగా వస్తున్నారు. భారీ సభలు, హంగులు బీఆర్ఎస్ కు కొత్త కాదు. ఈ సభ లక్ష్యం ఏంటనేది కేసీఆర్ కు మాత్రమే తెలుసు. తన ప్రసంగం ద్వారా స్పష్టతనిస్తాడా? లక్ష్యం లేని సభలా మిగులుతుందా? అన్నది చూడాలి.




**భూతల స్వర్గం కాశ్మీరం రక్తసిక్తం అయింది. భారత భూభాగంలోకి చొరబడి.. మన పౌరులను దారుణంగా కాల్చి , నిలదీసిన ప్రజలను మీ ప్రధానికి చెప్పకోపో అనేంత ధైర్యం ఆ ఉగ్రవాదులకు ఎక్కడిది? ఆనందంతో విహారానికి వెళ్ళిన కుటుంబాల్లో విషాదం నింపి, మన ప్రధాని పేరెత్తిన ముష్కరుల గుండెలు చీల్చాలని.. భవిష్యత్తులో ఇలాంటి దుస్సాహాలు జరగకుండా, కనీసం భారత్ పేరెత్తకుండా కఠినంగా శాస్తి చేయాలని దేశం కోరుకుంటోంది.**

**కశ్మీర్‌లో ఉగ్రవాదం కోరలు పీకామని, ఇక అక్కడేం చేయలేక జమ్మూ ప్రాంతంలో మిలిటెంట్లు తమ ప్రతాపాన్ని చూపిస్తున్నారని జమ్మూ, కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా అన్న కొన్ని రోజులకే దారుణం జరిగింది. ఉగ్రవాదం ఎప్పుడు పడగవిప్పి బుసలు కొడుతుందో అంచనా వేయటం సులభం కాదు. పహల్గాం దాడి నేపథ్యంలో దేశమంతా ఏకమై మోదీ వెనుక నిలబడింది.**

**సింధూ నదీజలాల ఒప్పందం నిలిపివేతను పాకిస్తాన్ ఊహించలేదు. ఇరు దేశాల మధ్య యుద్ధం వచ్చిన సందర్భాల్లో... ముంబైపై ఉగ్రదాడి జరిగినప్పుడు, పుల్వామాలో మన జవాన్లను ఉగ్రవాదులు పొట్టనబెట్టుకున్నప్పుడు కూడా మన దేశం ఆ ఒప్పందం నిలిపివేత గురించి మాట్లాడలేదు. సింధూ నదీజలాలపై పాకిస్తాన్ సాగునీటిరంగం 80 శాతం వరకూ ఆధారపడి వుంటుంది. ప్రపంచంలో తీవ్రమైన నీటికొరతను ఎదుర్కొనే దేశాల్లో పాకిస్తాన్ ఒకటి**

**పహల్గామ్ కేవలం ఓ పర్యాటక కేంద్రంగా మాత్రమే కాకుండా, అమర్నాథ్ యాత్ర మార్గంలో కీలకమైన బేస్ క్యాంపు. ఏడాది పొడవునా దేశీయ, విదేశీ పర్యాటకులతో కిటకిటలాడే ఈ ప్రాంతం లక్షలాది ప్రజలకు జీవనోపాధిని కలిగిస్తుంది. ఇటువంటి ప్రాంతంలో ఉగ్రదాడి జరగడం వెనుక వ్యూహాత్మక లక్ష్యం కనబడుతోంది .**

**ఆర్థికంగా కుదేలై అతలాకుతలమవుతున్నా పాకిస్థాన్ వక్రబుద్ధి మారడం లేదు ..దశాబ్దాలు గడుస్తున్నా కశ్మీర్ ను ఇంకా పరిష్కారం కాని ఒక సమస్యగా ప్రపంచానికి చూపే కుట్రలను కొనసాగిస్తున్నది. ఇది ఇప్పటికైనా అంతం కావాలి. భయాన్ని వ్యాపింపచేసేందుకు, హింసాకాండను రగిలించేందుకు కశ్మీరీ యువకులకు ఆయుధాలు, శిక్షణ ఇవ్వడాన్ని పాకిస్థానీ దుష్ట రాజ్యవ్యవస్థ కొనసాగిస్తున్నప్పుడు 'సాధారణ పరిస్థితుల' దిశగా కశ్మీర్ ఎలా పురోగమిస్తుంది? సమాజంలో విభజనకు ప్రయత్నిస్తున్న పాకిస్థాన్ దుష్ట పన్నాగాలను మనం ముందస్తుగా ఎదుర్కోవాలి. పాకిస్థాన్ తన పైశాచిక చర్యలకు భారీ మూల్యం చెల్లించి తీరాలి.**

**తెలంగాణ రాష్ట్రసమితి బిఆర్ఎస్ గా మారినా.. ఇపుడు రజతోత్సవ సంబరం పేరుతో భారీ సభ నిర్వహిస్తోంది. ఓ వైపు ఉగ్రదాడులు, భారత్ పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు, ఇంకో వైపు కర్రెగుట్టల్లో మారణహోమానికి మావోలను చుట్టుముట్టిన కేంద్ర బలగాలు.. ఇంకోవైపు కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ నివేదిక.. ఇవన్నీ ఇలా ఉన్నా అసెంబ్లీ ఎన్నికకు మరో మూడున్నరేళ్ళు. ఇలాంటి పరిస్థితుల్లో కేసీఆర్ ఓ సభ నిర్వహించి ప్రజలను మెప్పించడం పెద్ద సవాలే. గులాబీ వర్గాల్లో మొట్టమొదటిసారి కేసీఆర్ సభపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత ఏడాది లోక్ సభ ఎన్నికల కోసం తెలంగాణ వ్యాప్తంగా ప్రచారం నిర్వహించిన కేసీఆర్ ఇపుడు మళ్ళీ వరంగల్ సభ ద్వారా ప్రజల ముందుకు నేరుగా వస్తున్నారు. భారీ సభలు, హంగులు బీఆర్ఎస్ కు కొత్త కాదు. ఈ సభ లక్ష్యం ఏంటనేది కేసీఆర్ కు మాత్రమే తెలుసు.**

## పాక్‌కు ఔషధాల కొరత

పెహల్‌గామ్ దాడికి ప్రతికారంగా పాకిస్తాన్‌పై భారత ప్రభుత్వం కఠిన చర్యలకు దిగింది. భారత్ చర్యలకు బదులుగా పాక్ ప్రభుత్వం పౌరుషానికి పోయి వాణిజ్య సంబంధాలు తెంచుకుంటున్నామని ప్రకటించింది. పాక్ ఈ ప్రకటన చేసి రెండు రోజులు గడవకముందే కష్టాలను ఎదుర్కొంటోంది. భారత్‌తో వాణిజ్య సంబంధాలు తెంచుకోవడంతో పాకిస్తాన్ వైద్య అధికారులు ఔషధ సరఫరాల కోసం 'అత్యవసర ' చర్యలను ప్రారంభించినట్టు శనివారం ఆ దేశ మీడియా తెలిపింది. జియో న్యూస్ ప్రకారం, భారత్‌తో వాణిజ్యం నిలిపేయడం వల్ల దేశంలో ఫార్మాస్యూటికల్ అవసరాల నిల్వకు అత్యవసర చర్యలు మొదలయ్యాయి. అధికారిక నోటిఫికేషన్ లేనప్పటికీ అత్యవసర ప్రణాళికలు అమల్లో ఉన్నాయని డ్రగ్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ పాకిస్తాన్(డీఆర్ఏపీ) ధృవీకరించింది. 2019 కొవిడ్ సంక్షోభం తర్వాత ప్రభుత్వం ఇటువంటి అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనేందుకు ఔషధ నిల్వలను కొనసాగిస్తోంది. అయితే, ఈసారి పరిస్థితులు భిన్నం. దేశంలో కావాల్సిన ఔషధ అవసరాలను తీర్చేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నామని డీఆర్ఏపీ సీనియర్ అధికారి చెప్పారని జియో న్యూస్ పేర్కొంది.



**రచనలకు ఆహ్వానం**
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
**మీ రచనలు పంపాల్సిన చిరునామా:**
mahaapatrika@gmail.com
whatsapp- 74369 39999

# రైతుల సంక్షేమం కోసమే భూభారతి

- చట్టంతో సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం
- విచారణ, సర్వే జరిపిన తర్వాతే రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు
- గ్రామాల వారీగా రికార్డుల నిర్వహణ
- అవగాహన సదస్సుల్లో కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్, మహా :** రైతుల భూ సమస్యలు పరిష్కరించి.. వారి సంక్షేమం కోసమే రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టం తీసుకొచ్చిందని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. శనివారం కరీంనగర్ రూరల్ మండలం దుర్షేడ్ రైతువేదిక, కొత్తపల్లిలోని రైతువేదికలో భూభారతి చట్టంపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయగా కలెక్టర్ హాజరై మాట్లాడారు. ధరణి చట్టంలో సాదాబైనామా దరఖాస్తులను పరిష్కరించలేదని.. భూభారతి చట్టంలో మాత్రం పెండింగ్ లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులను పరిష్కరించేలా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ధరణి చట్టంలో మాదిరి కాకుండా నూతన చట్టంలో క్షేత్రస్థాయిలో సర్వే చేసి విచారణ జరిపిన తర్వాతే రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు చేయనున్నట్లు వివరించారు. ధరణిలో ఉన్న 33 మాడ్యూల్స్ కారణంగా రైతులు తమ భూ సమస్య దేని పరిధిలోకి వస్తుందో తెలియక కోర్టులు, కలెక్టరేట్ చుట్టూ తిరుగుతూ ఇబ్బంది పడే వారన్నారు. నూతన చట్టంలో మాత్రం రెండంచెల అప్పీలు వ్యవస్థ తీసుకొచ్చారని అన్నారు. భూమి సవరణల కోసం దరఖాస్తు చేసుకుంటే 60 రోజుల్లోగా సమస్య పరిష్కారం అయ్యేలా చట్టం రూపొందించినట్లు వివరించారు. రైతులు తమ భూ సమస్యలకు తహసీల్దార్ వద్ద న్యాయం జరగలేదనుకుంటే.. ఆర్డీవో వద్దకు.. అక్కడ సంతృప్తి చెందకుంటే.. కలెక్టర్.. భూమి ట్రిబ్యునల్ వద్దకు వెళ్లి అప్పీలు చేసుకోవచ్చని పేర్కొన్నారు. నూతన చట్టంలో అబాదీ, వ్యవసాయేతర భూములు, నివాస స్థలాలకు హక్కులు కల్పించనున్నట్లు వివరించారు. ఆధార్ మాదిరి భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి భూకమతానికి భూదార్ సంఖ్య కేటాయించినట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో ఏటా భూ మార్పుల రిజిస్టర్, చెరువులు కుంటలు తదితర నీటి వనరుల రిజిస్టర్, ప్రభుత్వ భూముల రిజిస్టర్, పహానీ వంటి రికార్డులను మెయింటైన్ చేస్తారని తెలిపారు. గతంలో భూమి దరఖాస్తులను పరిష్కరించే అధికారం కలెక్టర్ కు మాత్రమే ఉండేదని.. భూభారతి ప్రవేశపెట్టే ముందు తహసీల్దార్, ఆర్డీవోలకు డెలిగేసిన్ ఆఫ్ పవర్స్ ఇవ్వడం ద్వారా గతంలో కలెక్టర్ లాగిన్ లో 11వేల దరఖాస్తులు ఉండగా.. ప్రస్తుతం వాటి సంఖ్య రెండు వేలకు తగ్గిందన్నారు. రైతులెవరూ ఆందోళన చెందవద్దని.. అందరి దరఖాస్తులను పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

**భూభారతి చట్టం.. రైతుల చుట్టం**

కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టం రైతులకు చుట్టంలా వ్యవహరిస్తుందని కూడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. ధరణి కారణంగా చెప్పులు అరిగేలా తిరిగినా.. రైతుల భూ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ధరణితో గత ప్రభుత్వంలో ఉన్న నాయకులు వందల ఎకరాలు తమ పేరిట చేసుకున్నారని విమర్శించారు. ధరణి పోర్టల్ లో నాకు కూడా 20 గుంటలు తక్కువ ఉన్నట్లు నమోదు కావడంతో ఇబ్బంది పడినట్లు తెలిపారు. రైతుల సమస్యను అధిగమించేందుకే భూభారతి చట్టం తీసుకొచ్చినట్లు వివరించారు. ఈ చట్టంతో తహసీల్దార్, ఆర్డీవో వద్దనే సుమారు 80 శాతం భూ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. రైతును రాజును చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని.. ఈ చట్టంపై అవగాహన పెంచుకొని తోటి వారికి వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు రాజు, రాజేష్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేయండి

- స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనుల పరిశీలన
- బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే



**వరంగల్, మహా ;** సమ్మర్ కోచింగ్ క్యాంప్ నిర్వహణ లో భాగంగా క్రీడల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేయాలని బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయం లోని ఇండోర్ స్టేడియం తో పాటు స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులను కమిషనర్ క్షేత్ర స్తాయి లో పర్యటించి సమర్ధవంతం గా నిర్వహించడానికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ మే 1 నుండి ప్రారంభమయ్యే సమ్మర్ కోచింగ్ క్యాంప్ ను సమర్థవంతం గా నిర్వహించాలని క్రీడాకారుల కు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని 6 వివిధ రకాల క్రీడాంశాల్లో సుమారు నెలరోజుల పాటు శిక్షణ ఇవ్వనున్న నేపథ్యంలో అందుకు అవసరమైన క్రీడా సామాగ్రి తో పాటు ఏ అవసరాలు ఉన్నాయో గుర్తించి కనీస మౌలిక సదుపాయాలు ఉండేలా చూడాలని అన్నారు. అనంతరం ఇదే ఆవరణలో నూతనం గా నిర్మిస్తున్న స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులను కమిషనర్ పరిశీలించి పనుల్ని యుద్ధ ప్రాతిపాదికన పూర్తి చేసి సాధ్యమైనంత తొందరగా అందుబాటులోకి తేవాలని కమిషనర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో ఈ ఈ లు రవి కుమార్ మాధవి లత డి ఈ లు కార్తీక్ రెడ్డి రాజ్ కుమార్ ఏ ఈ లు రాగి శ్రీకాంత్ నరేష్ స్టేడియం సిబ్బంది భారత్ తదితరులు పాల్గొన్నారు.

**ఛాంబర్ లలో వసతులను పునరుద్ధరించండి**

తదనంతరం ప్రధాన కార్యాలయం లోని వివిధ విభాగాల ఛాంబర్ లలో దెబ్బతిన వివిధ వసతులను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే అభిప్రాయపడ్డారు. బల్దియా ప్రధాన కార్యాలయం లోని పాత భవనం లోగల వివిధ విభాగాల ఛాంబర్ లను కమిషనర్ శనివారం క్షేత్ర స్తాయి లో పరిశీలించి చేయాల్సిన ఏర్పాట్ల పై ఇంజనీరింగ్ అధికారులకు తగు సూచనలు చేశారు.

ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ కార్యాలయాల్లో దెబ్బతిన్న ఫ్లోరింగ్ మరుగు దొడ్లు నీటి సరఫరా ను పునరుద్ధరించడంతో పాటు దెబ్బతిన్న కుర్చీలు టేబుల్స్ స్థానం లో కొత్తవాటిని సమకూర్చడం ఎలక్ట్రికల్ కు సంబందించిన సమస్యల ను పరిష్కరించడం అవసరమున్న ప్రాంతాల్లో కంప్యూటర్ ల ఏర్పాటు తదితర సమస్యలను గుర్తించి వెంటనే ఏర్పాటు చేసేలా చూడాలని కమిషనర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో సి ఎం హెచ్ ఓ డా రాజారెడ్డి, ఈ ఈ రవి కుమార్, డి ఈ లు రాజ్ కుమార్, కార్తీక్ రెడ్డి, జేఏఓ లు సరిత, జగదీశ్వరి, సూపరిండెంట్ రావుల ఆనంద్, ఏఈ లు రాగి శ్రీకాంత్, నరేష్, తదితరులు, పాల్గొన్నారు.

## ఉగ్రవాదులు దాడికి నిరసనగా కొవ్వొత్తులు ర్యాలీ




**బాలాపూర్ మహా :** జమ్ము కాశ్మీర్ పహల్గామ్ లో పర్యాటకుల పై ఉగ్రవాదులు జరిపిన దాడిని ఖండిస్తూ బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోనీ 12 కాలనీ అసోసియేషన్ సభ్యులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పాకిస్తాన్ జెండాను చెప్పులతో కొడుతూ కాల్చి వేశారు కాలనీ వాసులు. పర్యాటకుల పై దాడి అత్యంత బాధాకరమని కాలనీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. హిందువులంతా ఐక్యంగా ఉండాలని ఇకనైనా మేలుకోకుంటే హిందువుల పరిస్థితి భవిష్యత్తులో గోరంగా ఉంటుందని అన్నారు. భవిష్యత్ తరాలకు హిందూ ధర్మం గురించి నేర్పించవలసిన అవసరం ప్రతి వ్యక్తి పై ఉందని అన్నారు. ఉగ్రవాదులు తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని వారికి బతికి ఉండే అర్హత లేదని మండిపడ్డారు. భారతదేశం లో ఉంటూ ఉగ్రవాదులకు మద్దతు తెలుపుతున్నవారు ఇక్కడ ఉండే అర్హత లేదని మండిపడ్డారు. ఉగ్రవాదులు చర్యలను ఏమాత్రం ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి కాలనీ వాసులు విజ్ఞప్తి చేశారు. భవిష్యత్ లో ఉగ్రవాదులు భారతదేశం పై దాడు చేయాలంటే ఓనికి పోయేలా ప్రతి చర్య ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమం లో బీడీఎల్ కాలనీ బిట్టు నరేందర్,ఉమేష్ సింగ్ నాగరాజ్,గిరి,సాయి నగర్ కాలనీ గిరి,ప్రేమ్ కుమార్,విజయ యాదవ్, శివ కుమార్,పద్మావతి కాలనీ కుమార్,సత్యనారాయణ చారి, మల్లికార్జున నగర్ శశిధర్ రావు, ఆనంద్,లోకాయుక్త కాలనీ భాస్కర్ గౌడ్,సాయి నగర్ యశ్వంత్ తల్లాడి,గాయత్రి హిల్స్ కాలనీ శ్రీకాంత్ గౌడ్,శ్రీనివాస్ తదిరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియ వేగవంతం చేయాలి



**వరంగల్, మహా ;** ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా రెండో దఫా గృహాల నిర్మాణాల కోసం లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియ వేగంగా చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. శనివారం వరంగల్ నగరంలోని, 18 డివిజన్ క్రిస్టియన్ కాలనీలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల గుర్తింపు సర్వే తీరును క్షేత్ర స్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. రెండో దఫా ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపునకు సంబంధించి అర్హులేనా కదా అన్న విషయాన్ని భౌతికంగా పరిశీలించి, డేటా ఆధారం గా అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు నిర్వహిస్తున్న సర్వే విధానాన్ని కలెక్టర్ పరిశీలించి ప్రభుత్వ నిబంధనల మేరకు సమర్ధంగా నిర్వహించుటకు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధల మేరకు అర్హుల గుర్తింపు అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతో జరగాలన్నారు. ఇందిరమ్మ కమిటీ ఆమోదించిన ప్రతి 200 ఇండ్లకు నియమించిన ప్రత్యేక అధికారి అత్యంత జాగ్రతతో ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని అన్నారు. ఇందిరమ్మ కమిటీలు అందించిన జాబితాలో ఎవరైనా అనర్హులు ఉంటే మంజూరు చేసే జాబితా నుంచి తొలగించాలని అధికారులకు సూచించారు. ఈనెల 30 వరకు అర్హతల పరిశీలన ప్రక్రియ పూర్తికావాలన్నారు. భూమి విస్తీర్ణం 60 గజాలకు మించకూడదని, గతంలో బేస్మెంట్, పిల్లర్స్ కట్టిన వారు ఇందిరమ్మ పథకానికి అర్హులుకారనే విషయాన్ని గుర్తించాలనీ, ఇందిరమ్మ ఇళ్ల పథకంనకు ఎంపికైనవారు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నుండి ప్రొసీడింగ్స్ అందిన తర్వాతే నూతన ఇండ్ల నిర్మాణానికి ముగ్గు పోసుకుని ప్రారంభించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ రామిరెడ్డి, హౌసింగ్ ప్రాజెక్ట్ అధికారి గణపతి, కార్పొరేటర్ వస్కుల బాబు, ప్రత్యేక అధికారి రమేష్, రెవెన్యూ అధికారి శ్రీనివాస్, వార్డ్ ఆఫీసర్, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## కళాశాలల వసతిగృహ కార్మికులకు వేతనాలు చెల్లించాలి



**రంగారెడ్డి జిల్లా మహా :** ఎస్సీ, ఎస్టీ, బీసీ కళాశాలల వసతిగృహాల్లో పనిచేస్తున్న కార్మికులకు 10 నెలల వేతనాలు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర బీసీ ఫ్రంట్ చైర్మన్ గౌరిగే మల్లేష్ యాదవ్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బీసీ ఎస్సీ ఎస్టీ కళాశాల హాస్టల లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల 10 నెలల నుండి జీతాలను వెంటనే చెల్లించాలని మరియు ఔట్సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ బీసీ భవన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర బీసీ ఫ్రంట్ చైర్మన్ గౌరిగే మల్లేష్ యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జీతాల కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమానికి సిద్ధం కావాలని ఉద్యోగులకు ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ బీసీ, ఎస్సీ ఎస్టీ కళాశాలల హాస్టల్ వర్కర్ల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం విద్యానగర్ లోని బీసీ భవన్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యం ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేస్తున్న రోజువారీగా రూ.500 మాత్రమే చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. అది కూడా 10 నెలలుగా ఇవ్వకపోవడంతో వారంతా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వేతనాలను రూ. 15 వేల నుంచి రూ.25 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. పొరుగు సేవల విధానాన్ని ఎత్తేసి నేరుగా కార్మికుల ఖాతాల్లోనే జమ చేయాలని సూచించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్, వివిధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

## ఉద్యమం పేరు చెప్పి పదేళ్లు అధికారం అనుభవించారు

- అధికారంలోకి వచ్చి తెలంగాణను దోచుకున్న పార్టీ
- అభివృద్ధి పేరుతో తెలంగాణను ఆగం చేసిన బిఆర్ఎస్ కుటుంబం
- బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్




**వరంగల్, మహా;** ఎందరో బలిదానాలు, మరెందరో త్యాగాల పునాదుల మీద ఉద్యమం పేరుతో అధికారంలోకి వచ్చి తొమ్మిదిన్నర ఏళ్ళు అధికారాన్ని అడ్డుపెట్టుకొని భూకబ్జాలు చేశారే తప్ప రాష్ట్రాన్ని అభివృద్ధి చేయలేదని శనివారం వరంగల్ జిల్లా బిజెపి అధ్యక్షులు గంట రవికుమార్ అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ అధినేత కెసిఆర్ కేటీఆర్ పై ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ కు ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని అందుకే వరంగల్ నగరంలో సభ పెడితే విజయవంతం కాదనే ఉద్దేశంతోనే కరీంనగర్, సిద్దిపేట బార్డర్లో పెట్టుకుంటున్నారు. గప్పలు కొట్టే పిట్టలదొర మళ్లీ వస్తున్నాడని ఓరుగల్లు ప్రజలు తస్మాత్ జాగ్రత్త అని అన్నారు. ఎల్కతుర్తిలో సభ పెట్టి చలో వరంగల్ అని పిలుపునియ్యడం సిగ్గుచేటన్నారు. వరంగల్ కు మాస్టర్ ప్లాన్ కూడా అమలుచేయకుండా పదేండ్లు అభివృద్ధిని అడ్డుకొని 50 ఏళ్లు నగరాన్ని వెనక్కి నెట్టిన నీచపు చరిత్ర బిఆర్ఎస్ పార్టీదని మండిపడ్డారు. ప్రతి ఏడాది వరంగల్ కు 300 కోట్లు ఇస్తామని ప్రజలన మోసం చేసింది బి.ఆర్.ఎస్ పార్టీ కాదా అని ప్రశ్నించారు. 2014 సంవత్సరం మడికొండలో జరిగిన సభలో మీరే కదా ఏడాదిలోపు డబుల్ బెడ్ రూమ్ లు కట్టించి యాటపోతు కోసి, కల్లు గుడాలతో గృహప్రవేశాలు చేస్తామన్నది మీరు కాదా..! వరంగల్లోని పేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వకుండా మరలా ఎన్నికల ముందు ప్రచారం చేసిన పార్టీ బిఆర్ఎస్ అని అన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అంతర్గత రోడ్లు అంటూ ఆకాశాన్ని తాకే హామీలు ఇచ్చిన బిఆర్ఎస్ పార్టీ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని 2023 ఎన్నికల ముందు 750 కోట్లతో అభివృద్ధి పనులకు కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపన చేసిన కేటీఆర్ ఎక్కడ నీ అభివృద్ధి పనులు? కాకతీయుల ఘన చరిత్ర కలిగిన ఓరుగల్లు మహానగరాన్ని చిన్నచూపు చూసి అభివృద్ధి పేరిట మాయమాటలు చెప్పి 10 ఏళ్లు పబ్బం గడిపారని సిద్దిపేటను అభివృద్ధి చేసుకోవడం కోసం వరంగల్ నిధులను మళ్లించిన దరిద్రపు పార్టీ బిఆర్ఎస్ అని ఉమ్మడి వరంగల్ ను 6 ముక్కలు చేసి, నగరాన్ని రెండు ముక్కలు చేసిన నీచపు చరిత్ర టిఆర్ఎస్ పార్టీదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎయిర్పోర్ట్ మంజూరు చేసిన భూసేకరణ చేయకుండా అడ్డుకున్నారు సైనిక్ స్కూల్, హెచ్ ఆర్ డి రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ లాంటి కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థలకు భూమి కేటాయించకుండా అడ్డుకున్నారని వరంగల్లోని వ్యాపారులను అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన పార్టీ ఏ ముఖం పెట్టుకొని వరంగల్ సమీపంలో సభ పెడుతున్నారో వరంగల్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ పార్టీ పైన కెసిఆర్ పైన ప్రజలు అప్రమత్తంగ ఉండాలని మరోసారి మోసం చేయడానికి వస్తున్నాడని రైతులను నిండా ముంచిన టిఆర్ఎస్ ధరణి పేరుతో రైతులను ఆగం చేసి భూములను గుంజుకున్నది కేసీఆర్ ప్రభుత్వం కాదా అని సూటిగా ప్రశ్నించారు. కెసిఆర్ ఎక్కడ సభ పెట్టిన ఆ భూములు కబ్జాలకు గురయ్యాయి. గతంలో హనుమకొండ ప్రకాశ్ రెడ్డి పేటలో కావచ్చు హైదరాబాద్ లోని కొంగరకలంలో అదే జరిగింది. ఇప్పుడు ఎలుకతుర్తి సమీప గ్రామాల రైతులకు కూడా అప్రమత్తంగా ఉండాలి చదును చేసిన భూముల్లో హద్దులు జరిపిన బిఆర్ఎస్ నేతలు గద్దల వాలుతారని రైతున్నలు తస్మాత్ జాగ్రత్త అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, వన్నాల వెంకటరమణ, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్, డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మాచర్ల దీన్ దయాల్, గడల కుమార్, కోశాధికారి కూచన క్రాంతి కుమార్, అధికార ప్రతినిధులు ఆడెపు వెంకటేష్, శ్రీరంగం సాగర్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు పోలేపాక మార్టిన్ లూథర్, బిజెపి శివ నగర్ మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ, బిజెపి నాయకులు రామిని సుమన్, ముంద్రాతి వెంకటేశ్వర్లు మరియు తదితరులు పాల్గొన్నారు.

## మోడి పాలనకు ఆకర్షితులై బిజెపి లో చేరుతున్నారు : మంత్రి అనగాని సత్యప్రసాద్






**విశాఖ, మహా :** ప్రధాన మంత్రి మోడి పాలనకు ఆకర్షితులై అనేక మంది బిజెపి లో చేరుతున్నారని మంత్రి అనగాని సత్య ప్రసాద్ అన్నారు. విశాఖ లో బిజెపి ఆధ్వర్యంలో అంబేద్కర్ సమ్మాన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన సమక్షంలో బిజెపి లో భారీగా చేరికలు జరిగాయి. బిజెపిలో చేరిన పోర్టు స్టేడియం లో స్విమ్మింగ్ పూల్ లో బాలుడు మృతితో వివాదాస్పదమైన స్పోర్ట్స్ క్లబ్ నిర్వాహకుడు కాశీ విశ్వనాథ్ బిజెపి లో చేరడం చర్చనీయాంశమైంది. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి మోడి పాలనకు ఆకర్షితులై అనేక మంది బిజెపి లో చేరుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదులు విషయంలో చాలా కఠినంగా వ్యవహరిస్తుందని ఉగ్రవాదులు తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. భారత దేశంలో మత కల్లోలాలు సృష్టించాలని ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మతం అడగలేదని అన్నారు కానీ బాధితులు చెప్పారు మతం అడిగి చంపారని వివరించారు. సోషల్ మీడియా లో కొందరు మత విద్వేషాలతో రెచ్చగొడితే సహించేది లేదని హెచ్చరించారు. ఎవ్వరు ఎన్ని కుట్రలు చేసినా కోట్లాది మంది భారతీయులు ఒకటై నిలవాలి పిలుపునిచ్చారు.

## నేరాల నియంత్రణ కే నిఘా నేత్రాలు

**మహేశ్వరం జోన్ లో 855 సీసీ కెమెరాలను ప్రారంభించిన రాచకొండ సిపి సుధీర్ బాబు**




**బాలాపూర్ మహా:** మహేశ్వరం నియోజకవర్గం,బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లోని బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధి లో రాచకొండ కమిషనర్ సుదీర్ బాబు చేతుల మీదుగా మహేశ్వరం జోన్ లో ఏర్పాటు చేసిన 855 సీసీ కెమెరాల ప్రారంభించారు. అనంతరం సిపి సుధీర్ బాబు మాట్లాడుతూ ప్రజల సహకారంతో 885 కమ్యూనిటీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు సిపి సుధీర్ బాబు తెలిపారు. సీసీ కెమెరాలు క్రైమ్ ఫ్రీ సీటీ లో భాగంగా మహేశ్వరం జోన్ లో 136 దేవాలయాలలో 550 కెమెరాలు,289 కమ్యూనిటీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు సిపి తెలిపారు. వంద మంది పోలీస్ లు చేసే పనిని ఒక సీసీ కెమెరా పని చేస్తుందని క్రైమ్ కేసులో తొందరగా డీటెక్ట్ చేయడం జరుగుతుంది అని తెలిపారు. శాంతి భద్రతలు అదుపులో ఉన్నప్పుడే అభివృద్ధికి సాధ్యమవుతుందని సిపి తెలిపారు. మహిళ భద్రతకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. దేశంలో అత్యధిక సిసి కెమెరాలు ఉన్న రాష్ట్రంగా తెలంగాణ అవతరించిందని ఈ సంవత్సరంలో 57 ముఖ్యమైన కేసులలో సీసీ కెమెరాలు ఉపయోగపడ్డాయని సిపి తెలిపారు. కార్యక్రమం లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నరసింహారెడ్డి, మహేశ్వరం డీసీపీ సునీత రెడ్డి, మహేశ్వరం జోన్ ఎసిపిలు, ఇన్స్పెక్టర్లు,ఎస్సైలు,అధికారులు, నాయకులు వంగేటి ప్రభాకర్ రెడ్డి, బొర్రా జగన్ రెడ్డి,పెద్దబావి సుదర్శన్ రెడ్డి,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కొత్త చట్టం ద్వారా భూ వివాదాలకు పరిష్కారం

- జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి
- ఆధార్ తరహాలోనే భూ కమతాలకు భూదార్
- భూభారతి చట్టంతో రైతులకు కలిగే ప్రయోజనం
- భూ సమస్యలకు మండల, డివిజన్లో సులభతరం



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మహా :** భూ సమస్యలను మండల, డివిజన్ స్థాయిలలో చాలా సులభతరంగా పరిష్కరించాలని ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకురావడం జరిగిందని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి వెల్లడించారు. శనివారం జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, స్థానిక శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ తో కలిసి షాద్ నగర్ నియోజక వర్గం కొత్తూరు మున్సిపల్ కార్యాలయంలో, నందిగామ లోని ప్రిన్స్ ప్యాలెస్ నందు నిర్వహించిన భూభారతి (ఆర్.ఓ.ఆర్ 2025) నూతన చట్టం అవగాహన సదస్సులలో పాల్గొన్నారు. ముందుగా కాశ్మీర్ లోని పహల్గామ్ మృతులకు నివాళులు అర్పించిన సదస్సులో జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి భూభారతి చట్టంతో రైతులకు కలిగే ప్రయోజనాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సవివరంగా తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహానీయుడైన డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ జయంతి నాడు భూభారతి (ఆర్.ఓ.ఆర్ 2025) నూతన చట్టం ప్రారంభించడం జరిగినదని అన్నారు. ధరణిలోని సమస్యలను తీర్చడానికి అదే విధంగా రైతులకు భరోసా కల్పించాలనేది ఈ కొత్త ఆర్.ఓ.ఆర్ చట్టం ముఖ్య ఉద్దేశమని అన్నారు. మొదటి ఆర్.ఓ.ఆర్ చట్టం 1971 లో వచ్చిందని, 2020 లో వచ్చిన రెండవ ఆర్.ఓ.ఆర్ చట్టం ధరణి చట్టం అని, ధరణిలో కఠినమైన నిర్ణయాలు ఉన్నందున సమస్యలు తలెత్తడం జరిగినదని అన్నారు. మండల, డివిజన్ స్థాయిలలో భూ సమస్యలు సులభతరంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో భూభారతి చట్టాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. కొత్త చట్టం ద్వారా భూ వివాదాలకు ఆస్కారం లేకుండా ప్రభుత్వం ఆధార్ తరహాలోనే భూ కమతాలకు భూదార్ నెంబర్లను కేటాయించడం జరుగుతుందని తెలిపారు. నిర్దిష్ట గడువు లోపు భూ సమస్యలు పరిష్కారం అయ్యేందుకు ఈ చట్టం ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. ఇది వరకు అమలులో ఉన్న ధరణితో పోలిస్తే, రైతు ప్రయోజనాలే ధ్యేయంగా ప్రభుత్వం అనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ భూభారతి చట్టం తెచ్చిందని అన్నారు. భూధార్ నెంబర్ కేటాయిపు వల్ల భూ ఆక్రమణలకు, అనవసర వివాదాలకు అవకాశం ఉండదని, రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు, భరోసా లభిస్తుందని అన్నారు. భూముల రికార్డులలోని పొరపాట్లను పరిష్కరించేందుకు ధరణిలో అవకాశం ఉండేది కాదని, ప్రస్తుతం భూభారతి చట్టం ద్వారా అలాంటి సమస్యలు పరిష్కరించుకునే వెసులుబాటు కల్పిస్తూ నూతన చట్టంలో అవకాశం కల్పించారని తెలిపారు. ఈ చట్టం అమలులోకి వచ్చిన ఏడాది కాలం లోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. వాటిని తహసీల్దార్, ఆర్డీఓ స్థాయిలలో పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. మే, జూన్ మాసాలలో గ్రామాల వారీగా అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించి, భూ సమస్యలు ఉన్న రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. రైతుకు అన్యాయం జరిగితే అప్పీల్ చేసుకోవడం ద్వారా న్యాయాన్ని పొందవచ్చని, ఆర్డీఓ, జిల్లా కలెక్టర్, సి సి ఎల్ ఎ స్థాయిలలో అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. భూభారతి చట్టంలో బాధితులకు న్యాయ సలహా వ్యవస్థ ఉందని, గతంలో గ్రామాలలో గ్రామ పరిపాలన, విఆర్ఓ/వి.ఆర్.ఏ వ్యవస్థ ఉండేవని, వాటిని తొలగించడం ద్వారా గ్రామాలలో సమస్యలపై సమాచారం లేదని తెలిపారు. ప్రభుత్వం అర్హులైన వారిని గ్రామ పాలన అధికారి, మండల సర్వేయర్లను నియమించడం జరుగుతుందని, విరాసత్ మార్పిడికి వారసులకు అందరికీ నోటీసులు జారీ చేసే ప్రక్రియ ఈ నూతన చట్టంలో ఉందని, గతంలో ధరణి చట్టంలో ఈ అవకాశం లేదని తెలిపారు. ప్రతి రైతు భూభారతి చట్టంలోని అంశాలను అవగాహన చేసుకోవాలని తెలిపారు. ప్రతీ సంవత్సరం డిసెంబర్ 31న రికార్డుల ఆధునీకరణ చేస్తారని అన్నారు. భూ సమస్యలు ఉన్న రైతులు భూభారతి చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఈ నూతన చట్టంపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు. 12102020 నుండి 10112020 వరకు పెండింగులో ఉన్న సాదాబైనామా దరఖాస్తులకు భూభారతి చట్టం ద్వారా క్రమబద్ధీకరించుకునే అవకాశం ఏర్పడిందని, హైకోర్టు విధించిన స్టే ఉత్తర్వులు తొలగిన మీదట వీటిని క్రమబద్ధీకరించేలా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేయనున్నదని కలెక్టర్ వివరించారు. స్థానిక శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ఈ రోజు చాలా సంతోషంగా ఉందని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ధరణిని బంగాళాఖాతంలో వేసి, ప్రతి రైతుకు ధరణిలో ఎదుర్కొన్న సమస్యలను, ఇబ్బందులను తీర్చడానికి నూతన ఆర్ ఓ ఆర్ భూభారతి చట్టాన్ని తీసుకురావడం జరిగిందని తెలిపారు. రైతు ఆత్మ గౌరవం దెబ్బతినకుండా, రైతుకు ఇబ్బందులు ఏర్పడకుండా ఉండేలా 15 నెలలు కూలకషంగా చర్చించి రూపొందించడం జరిగిందని అన్నారు. ఈ సదస్సులలో షాద్ నగర్ మున్సిపల్ ఛైర్మన్ లావణ్య దేవేందర్, వైస్ ఛైర్మన్ రవీందర్, కౌన్సిలర్లు దేవేందర్, కరుణ సుదర్శన్, చంద్రకళ రాజేందర్, మున్సిపల్ కమిషనర్ బాలాజీ, ఎంపీడీఓ అరుంధతి, ఆర్డీఓ సరిత, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బాబర్, తహసీల్దార్లు, వ్యవసాయ శాఖ ఏ. డి. రాజారత్నం, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## ఉగ్రవాదాన్ని అంతమొందించాలి

- పాకిస్తాన్ దిష్టి బొమ్మ దహనం

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రవాద ఘటనను ఖండిస్తూ, ఉగ్రవాద దాడిలో మరణించిన భారత పౌరులకు నివాళులర్పించారు, ఏఐసీసీ పిలుపు మేరకు ఆమనగల్ పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసనలు తెలియజేసి, పాకిస్తాన్ దిష్టి బొమ్మ దగ్ధం చేయడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రవాద ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మృతుల కుటుంబాలకు సంఘీభావం ప్రకటించి మరణించిన వారికి శాంతి చేకూరాలని కోరారు. ఈ దాడి పాకిస్తాన్ మద్దతుతో పన్నిన కుట్రని, వెంటనే ఉగ్రవాదులను మరియు ఉగ్రవాద సంస్థలను ఏరిపారేయాలన్నారు. పహల్గాం దాడిని కశ్మీర్‌లో భద్రతా వైఫల్యం వల్లే ఈ ఉగ్రవాద ఘటన జరిగిందన్నారు. దీని వెనుక ఎవరు ఉన్న విడిచి పెట్టే ప్రసక్తే ఉండదని హెచ్చరించారు. కశ్మీర్‌లో భద్రతా చర్యలను బలోపేతం చేయాలని, ఉగ్రవాదంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఉగ్రదాడిలో పర్యాటకులను కాపాడే ప్రయత్నంలో భాగంగా ప్రాణత్యాగం చేసిన స్థానికుల పోరాటాన్ని గుర్తు చేశారు. పహల్గాం ఉగ్రవాద బాధితులందరికీ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఎస్సీ సెల్ నాగర్ కర్నూలు జిల్లా అధ్యక్షులు మల్లేపల్లి జగన్, ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యవర్గ సభ్యులు అయిల్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షులుశ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తెల్గమల్ల జగన్ పట్టణ అధ్యక్షులు పసుపుల, అమనగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీఖ్యా నాయక్, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేష్, బ్లాకు కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ, రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్యామ రాజేష్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు అశోక్, సేవా దల్ అధ్యక్షులు లక్ష్మయ్య, బీసీ సెల్ మండల అధ్యక్షులు యాదయ్య, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు బాలరాజు, టౌన్ వర్కింగ్ అధ్యక్షులు రామచందర్ నాయక్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షులు షాబుద్దీన్, ఇమ్రాన్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోసు రవి, టౌన్ అధ్యక్షులు భానుకిరణ్, నాయకులు జాంగిర్ అలీ, చందోజి, మల్లేష్ గౌడ్, జాంగిర్ బాబా, అనిల్ యాదవ్, లక్ష్మణ్ నాయక్, ఎర్రోళ్ల శ్రీకాంత్, ఆకాష్ గౌడ్, సాయిరాం, సందీప్, రమేష్, దేవరశెట్టి మహేష్, రామకృష్ణ, రాజు నాయక్, శివ, నరేష్, శ్రీశైలం, వెంకటేష్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య రక్షణే జై బాపు జై భీమ్ జై సంవిధాన్ లక్ష్యం




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా :** రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యమని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవటానికి రాహుల్ గాంధీ జై బాపు, జై భీమ్, జై సంవిదాన్ నినాదానికి పిలుపునిచ్చారని టిపిసిసి సభ్యులు అయిళ్ళ శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ ముదిరాజ్, మాజీ జడ్పీటీసీ శ్రీపతి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం కల్వకుర్తి నియోజకవర్గం ఆమనగల్లు మండలంలోని చింతలపల్లి గ్రామంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్రలో స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఆదేశాలమేరకు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ సభ్యులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, ముఖ్య కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొని, గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూల దండ వేసి నివాళులు అర్పించారు. తదనంతరం కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ చేసి, గ్రామంలోని ప్రతి ఇంటి, ఇంటికి పాదయాత్రగా నాయకులలో బయలుదేరారు. ప్రజలతో కలిసి వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు అందించటమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తుంది అని అన్నారు. గతంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిందని గుర్తు చేశారు. ఈ పాదయాత్ర హాజరైన నాయకులు మాట్లాడుతూ.. మన దేశ రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాజ్యంగా విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. నేడు పేద, బలహీన వర్గాల ప్రజల ఆకాంక్షలు నెరవేరడం లేదని, ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను ఎదుర్కొని ప్రజాస్వామ్య పరిరక్షణకు దేశం మొత్తం ఏకం కావాలని కోరారు. రాజ్యాంగాన్ని రచించి ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా అందరికీ సమాన హక్కులు కల్పించిన రాజ్యాంగా నిర్మాత డాక్టర్ బీ. ఆర్ అంబేద్కర్ ఆలోచనలు కాపాడుకుందాం అంటూ, అహింస, శాంతి సిద్ధాంతాలను అలవర్చిన మహాత్మా గాంధీని స్మరించుకుందాం అంటూ, దేశ ప్రధానికి దేశ పేద ప్రజలకంటే బడబాబులే ముఖ్యం అన్నారు. రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం కాదని, అంబేద్కర్, గాంధీ, పూలే లాంటి గొప్ప వాళ్ళ ఆలోచనలతో కూడిన పవిత్ర గ్రంథం అని అన్నారు. పార్లమెంటు సాక్షిగా బీజేపీ పార్టీ రాజ్యాంగాన్ని అణగదొక్కాలని చూస్తుంది అని, అమిత్ షా పార్లమెంటు సాక్షిగా అంబేద్కర్ గారిని అవమాన పరిచారని, అందుకే గ్రామ, మండల స్థాయిలో ఈ కార్యక్రమాన్ని ప్రతి కాంగ్రెస్ నాయకుడు ప్రజల్లోకి తీసుకెళ్ళాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు మల్లేపల్లి జగన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, మండల మర్కెట్ డైరక్టర్ వస్పుల శ్రీశైలం, ఎస్సీ సెల్ తాలుక అధ్యక్షులు శంకర్, టౌన్ అధ్యక్షులు మనయ్యా, యువజన సంఘం తాలూకా ఉపాధ్యక్షులు శబ్బుదిన్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు వస్పుల శ్రీకాంత్, నాయకులు పెరుమండ్ల వెంకట్ రెడ్డి, ధనంజయ, కృష్ణ, ఖాదర్, మాజీ సర్పంచ్ జంగయ్య, మండల నాయకులు దృసాని బాల్ రెడ్డి, కొప్పు సుదర్శన్, కొప్పు యాదయ్య, కొప్పు చంద్రయ్య, గ్రామ అధ్యక్షులు కొప్పు సాయిలు, గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొప్పు శ్రీశైలం, ఎండపల్లి కృష్ణా రెడ్డి, శేఖర్ రెడ్డి, రంగారెడ్డి, కొప్పు రిచర్డ్, కొప్పు రాజు, కొప్పు శ్రీశైలం, గండికోట నర్సింహ, మహేష్, కొప్పు విజేందర్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గులాబీ జెండా పండుగ సంబురాలు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** భారత రాష్ట్ర సమితి 25వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం అమనగల్లు మున్సిపాలిటీలోని 11వ వార్డులో ఘనంగా గులాబీ జెండా పండుగ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఎగురవేసి మిఠాయిలు పంచడం జరిగింది. కార్యక్రమంలో మున్సిపల్ బిఆర్ఎస్ పార్టీ కన్వీనర్ డా" పత్య నాయక్, జహంగీర్, సయ్యద్ ఖలీల్, మాజీ ఎంపీటీసి కుమార్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురమల్ల సుభాష్, మాజీ సర్పంచ్ శ్రీను నాయక్, మున్సిపాలిటీ బిఆర్ఎస్ కార్యదర్శి వడ్డేమోని శివకుమార్, సైదులు, రంజిత్, ఏనుమల్ల రమేష్, కొమ్ము ప్రసాద్, డేరంగుల వెంకటేష్, వరికుప్పల గణేష్, వీరయ్య, లందం యాదయ్య, మహేష్ నేత, బాబా తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీఏ అధికారుల తనిఖీలు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా :** ఇబ్రహీంపట్నం లో శనివారం ఆర్టీఏ అధికారిని అనుష ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఇబ్రహీంపట్నం ఆర్టీవో సుభాష్ చంద్రారెడ్డి ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నం కేంద్రంలో ఆర్టీఏ మోటార్ వెహికల్ ఇనిస్పెక్టర్ అనూష ఆధ్వర్యంలో ముమ్మరంగా తనిఖీలు చేపట్టి, మోటార్ టాక్స్ లేని, ఫిట్నెస్ లేని, సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలకు తనిఖీలు చేపట్టి చలాన్ రాయడం జరిగింది. ఓవర్ లోడ్ తో వెళ్తున్న భారీ వాహనాలను అదుపులోకి తీసుకున్నారు. మొత్తంగా ఐదు హెవి వెహికల్స్, 5 స్మాల్ గూడ్స్ వెహికల్స్ అదుపులోకి తీసుకున్నట్లు మోటార్ వెహికల్ ఇనిస్పెక్టర్ అనూష వెల్లడించారు. వాహనదారులు సరైన పత్రాలు లేని వాహనాలను రోడ్లపై తిప్పరాదని, ఇలాంటి వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. సరైన పత్రాలతో వాహనాలను నడపాలని, మీరు మీ తోటి వారికి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని ఆమె కోరారు.

## భూ భారతితో.. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**షాద్ నగర్, మహా :** భూ వివాదాల శాశ్వత పరిష్కారానికి నూతన ఆర్. ఓ.ఆర్ చట్టం ఎంతగానో దోహదపడుతుందని షాద్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్, తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి ఆర్.ఓ.ఆర్ చట్టంపై కొత్తూర్ మండల కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి తో కలిసి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. ఈ సదస్సులో కలెక్టర్, భూ భారతి చట్టంలోని సెక్షన్లు, వాటి వివరాలను రైతులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మాట్లాడుతూ... భూ భారతి చట్టంతో రైతుల భూములకు రక్షణ లభిస్తుందని అన్నారు. రైతులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించిన రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి నిపుణుల కమిటితో వివిధ రాష్ట్రాల్లో అధ్యయనం చేసి పటిష్టమైన చట్టాన్ని రూపొందించి అమల్లోకి తెచ్చిందని తెలిపారు. ప్రత్యేకించి రైతులకు భూములపై భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. ధరణి పోర్టల్ ద్వారా ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొన్నారని కానీ భూ భారతి చట్టం ద్వారా అన్ని సమస్యలు సులభంగా, పరిష్కరించడానికి అవకాశం ఉందని అన్నారు.ఈ చట్టం వల్ల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించడం జరిగిందని పేర్కొన్నారు.అదే విధంగా రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసే ముందు భూముల వివరాలు పూర్తి స్థాయిలో సర్వే చేసి మ్యాప్ తయారు చేయడం జరుగుతుందని సూచించారు. సాదాబైనామా దరఖాస్తులు కూడా పరిష్కారమవుతాయని తెలిపారు. భూదార్ కార్డుల జారీ, ఇంటి స్థలాలు, ఆబాది, రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డివో సరిత తహసీల్దార్, ఎంపిడివో, రెవెన్యూ శాఖ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం కూల్చివేయడం తలాతోక లేని అలోచన



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇబ్రహీంపట్నంలోని చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం కూల్చివేయడం తలతోక లేని అలోచన అని, చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని కుల్చాడన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని వెంటనే పున: ప్రారంభించాలని టీఎంకెఎంకేస్ రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ్మా అన్నారు. తెలంగాణ మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం రంగారెడ్డిజిల్లా కమిటీ అధ్వర్యంలో శనివారం ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు కట్టకింద ఉన్న చాప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని టీఎంకెఎంకేస్ రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ్మా, జిల్లా అధ్యక్షులు చనమోని శంకర్, మంచాల మండల అధ్యక్షులు చింతకింది జంగయ్య, గార్లతో కలిసి చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలన చేసారు. అనంతరం టీఎంకెఎంకేస్ రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ్మా మాట్లాడుతూ... ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు కట్ట క్రింద ఉన్న చేప పిల్లలను ఉత్పత్తి చేసే 9 ట్యాంకులను ఎట్లా కుల్చేస్తారని ప్రశ్నించారు మత్స్యకార సంఘాలతో చర్చించకుండా కనీసం సమాచారం ఇవ్వకుండా ఎలా కుల్చివేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జిల్లాలో మెయిన్ పేట్, మేడ్చల్, రాజేంద్రనగర్, ఇబ్రహీంపట్నంలో నాలుగు ఉత్పత్తి కేంద్రాలు ఉండేవని ఇప్పుడు జిల్లాలో విభజించిన తర్వాత ఇబ్రహీంపట్నం ఒక్కటి మాత్రమే ఉన్నదని ఇక్కడ నుండి ఇబ్రహీంపట్నం మహేశ్వరం నియోజకవర్గాలకు చేప పిల్లలు ఇచ్చేదని 85 మత్స్యకార సొసైటిలు ఉన్నాయని వాటికి సీడ్ ఇవ్వాల్సిన భాధ్యత ఉందన్నారు. చెట్లను మొత్తం కూల్చి వేయడం జరిగిందని చేపలు పెంచడానికి అనువైన వాతావరణం పెద్ద పెద్ద యాప చెట్లు ఉంటే వాటిని కొట్టించరని వాపోయరు ఒకపక్క మ సంఘం చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలు పెంచి ప్రభుత్వమే చేపల ఉత్పత్తి చేసి ఇవ్వాలని కొత్త ఉత్పత్తి కేంద్రాలను నిర్మించి మత్స్యకారుల అభివృద్ధికి తోడ్పడాలని మేము కోరుతుంటే ఉన్న ట్యాంకులన్నీ కూల్చేసి కొంతమంది కాంట్రాక్టర్లు కమిషన్ల ఏజెంట్లు బ్రోకర్లు బ్రతకడానికి ప్రజలకు అందుబాటులో లేని స్థలంలో చేపల మార్కెట్ కట్టడం సరైంది కాదని విమర్శించారు. అదే విధంగా పక్కనే ఉన్న కోహెడ లో 47 కోట్లతో భారత దేశంలోని ఎక్కడ లేని విదంగా కొత్త టెక్నాలజీ లతో 10 ఎకరాల విస్తీర్ణంలో కడుతుంటే మళ్ళీ ఇక్కడ సీడ్ పామ్ కుల్చేయడం ఎందుకన్నారు.ఇది మత్స్య శాఖ అధికారుల అవగాహన లేమి తనమని ఈ చర్యలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాంటి అధికారుల వల్ల జిల్లాలో ఉన్న మత్స్య సొసైటీలకు నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. యధావిధిగా చెప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్న వెంటనే ఎర్పాటు చేయాలని చేపల మార్కెట్ ఇబ్రహీంపట్నంలో జన సాంద్రత ఉండే చోట నిర్మించాలని డిమాండ్ చేశారు. లేదంటే రాబోయే రోజుల్లో మత్స్యకారులను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షులు చనమోని శంకర్ మాట్లాడుతూ ఉత్పత్తి కేంద్ర కుల్చడం మంచిది కాదని ఇక్కడ ఉన్న భూమి సర్వే చెయించి అద్దురాళ్లు ఎర్పాటు చేయాలని డిమాండ్ చేసారు ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు చనమోని శంకర్, మంచాల మండల అధ్యక్షులు చింతకింది జంగయ్య, విరేష్, బి. యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ను జయప్రదం చేయండి




**డోర్నకల్, మహా :** మే నేల 20న జరుగు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతు పాఖాల కొత్తగూడ, గంగారం మండలాల పరిధిలో గల భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్టియు) ముఖ్య కార్యకర్తల సమావేశం పాఖాల కొత్తగూడ లోని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ ఆఫసులో సాంబరాజు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు SK. మదార్ పాల్గొని మాట్లాడుతూ.. కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలో కార్మిక రంగానికి తీవ్ర నష్టం కలిగించే విధంగా కార్మిక చట్టాలను సవరణ చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న 44 కార్మిక చట్టాలను సవరణ చేసి 4కోడ్ లుగా చేసిందన్నారు. ఈ నాలుగు లేబర్ కోడ్ ల వలన యావత్ దేశ కార్మిక వర్గ హక్కుల కు భంగం కలిగే విధంగా వ్యవహరిస్తూ, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఈ కార్మిక చట్టాలను సవరణ చేసిందన్నారు. అంతే కాకుండా సమాన పనికి సమాన వేతం ఇవ్వడలేదన్నారు. కనీస వేతనం నెలకి 26వేయిలు ఇవ్వాలని కార్మిక సంఘాలు అనేక సంవత్సరాలుగా డిమాండ్ చేస్తూన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా మండల నాయకులు భాస్కర్ రెడ్డి, గుండె శ్రీను, రాంబాబు, గట్టి సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నంలో కొవ్వొత్తుల ర్యాలీ



**రంగారెడ్డి జిల్లా మహా :** కాశ్మీర్ పహల్గంలో పర్యాటకులపై జరిగిన ఉగ్ర దాడి పిరికిపంద చర్య అని, ఇది మానవత్వానికి మాయని మచ్చ అని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంకాల శేఖర్ రెడ్డి అన్నారు. కశ్మీర్లో పర్యాటకులపై జరిగిన ముష్కరుల దాడిని నిరసిస్తూ శుక్రవారం రాత్రి ఎలిమినేడులో కాంగ్రెస్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీతో మృతులకు నివాళులర్పించారు. పాకిస్థాన్ కు కేంద్ర ప్రభుత్వం తగిన రీతిలో బుద్ధి చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎలిమినేడు గ్రామ అధ్యక్షులు పిట్టల యాదగిరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

## కాళేశ్వరంలో శని త్రయోదశి పూజలు



**కాటారం, మహా :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాలేశ్వరం లో శనివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ప్రధాన ఆలయ ఆవరణలో గల నవగ్రహాలకు శని త్రయోదశి పూజలను భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. జాతకరీత్యా నక్షత్రాల దోష నివారణ, ఆరోగ్య సమస్యలు తొలగేందుకు ప్రజలు శని త్రయోదశి రోజున పూజలు చేస్తుంటారు. కాలేశ్వరంలో కాలసర్ప దోష పూజలకు సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకములు శనేత్రయోదశి రోజున నవగ్రహాల పూజలు నిర్వహిస్తే సమస్యలు తొలగిపోతాయని భక్తులు విశ్వసిస్తూ ఇక్కడ పూజలు నిర్వహిస్తున్నారు. నివారణ గోదావరి నది త్రివేణి సంగమ తీరంలో పుణ్యస్నానాలు ఆచరించి కాలేశ్వరం స్వామి దర్శించుకొని భక్తులు నవగ్రహ పూజలు చేశారు. శని త్రయోదశి సందర్భంగా శని త్రయోదశి పూజలు 311. కాలసర్ప దోష పూజలు 120 శ్రీ స్వామివారి అభిషేకములు 78 జరిగినట్లు దేవాలయానికి రూ 3,61,009 ఆదాయం సమకూరినట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.



## ఇళ్ల కొనుగోలు నిర్ణయం..

# యువతే కీలకం

కరోనాతో స్థిరాస్తి రంగానికి జరిగిన ప్రధాన మేలు.. సొంతింటి అవసరం తెలిసిరావటమే. మరీ ముఖ్యంగా గృహ విభాగంలో యువతరం భాగస్వామ్యం పెరగడం. ఇళ్ల కొనుగోలు నిర్ణయంలో వీరు కీలకంగా మారారు. 74 శాతం సంపన్న కొనుగోలుదారులు ద్రవ్యోల్బణాన్ని నిరోధించేందుకు రియల్ ఎస్టేట్ ఒక ప్రధాన ఆస్తిగా పరిగణిస్తారు. విశాలవంతమైన గృహాలు, గ్రీనరీ ఎక్కువగా ఉండే ప్రాపర్టీలకే లగ్జరీ కొనుగోలుదారులు మొగ్గు చూపిస్తున్నారు. సంపన్న భారతీయుల ప్రాపర్టీ ఎంపికలో తొలి ప్రాధాన్యం మెరుగైన ఫిజికల్, సోషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సదుపాయాలకే. సంపన్న కొనుగోలుదారులు ప్రాపర్టీ కొనుగోళ్లకు ప్రధాన కారణం మెరుగైన జీవన శైలి. మూలధన వృద్ధి, భవిష్యత్తు తరాలకు ఆస్తి వంటివి ఆ తర్వాతి అంశాలు. కరోనాతో స్థిరాస్తి రంగానికి జరిగిన ప్రధాన మేలు.. సొంతింటి అవసరం తెలిసిరావటమే. మరీ ముఖ్యంగా గృహ విభాగంలో యువతరం భాగస్వామ్యం పెరగడంa. ఇళ్ల కొనుగోలు నిర్ణయంలో వీరు కీలకంగా మారారు. 74 శాతం సంపన్న కొనుగోలుదారులు ద్రవ్యోల్బణాన్ని నిరోధించేందుకు రియల్ ఎస్టేట్ ఒక ప్రధాన ఆస్తిగా పరిగణిస్తారు. విశాలవంతమైన గృహాలు, గ్రీనరీ ఎక్కువగా ఉండే ప్రాపర్టీలకే లగ్జరీ కొనుగోలుదారులు మొగ్గు చూపిస్తున్నారు. సంపన్న భారతీయుల ప్రాపర్టీ ఎంపికలో తొలి ప్రాధాన్యం మెరుగైన ఫిజికల్, సోషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సదుపాయాలకే. సంపన్న కొనుగోలుదారులు ప్రాపర్టీ కొనుగోళ్లకు ప్రధాన కారణం మెరుగైన జీవన శైలి. మూలధన వృద్ధి, భవిష్యత్తు తరాలకు ఆస్తి వంటివి ఆ తర్వాతి అంశాలు.

## వేర్‌హౌస్ లావాదేవీల్లో..

# అప్ అండ్ డౌన్

### గిడ్డంగుల లావాదేవీల్లో వృద్ధి.. సరఫరాలో క్షీణత

2025 క్యూ1లో 3 లక్షల చ.అ. స్థలం లీజుకు

ఇదే కాలంలో సరఫరా 2 లక్షల చ.అ.లే

50 శాతం పెరిగిన లీజులు, 67 శాతం తగ్గిన సప్లయి



హైదరాబాద్ పారిశ్రామిక గిడ్డంగుల(వేర్‌హౌస్) విపణిలో భిన్న వాతావరణం ఏర్పడింది. ఈ ఏడాది తొలి త్రైమాసికం(క్యూ1)లో నగరంలో 3 లక్షలు చ.అ. లావాదేవీలు జరిగాయి. గతేడాది ఇదే కాలంలో జరిగిన 2 లక్షల లావాదేవీలతో పోలిస్తే ఇది 50 శాతం అధికం. ఇక, 2025 క్యూ1లో నగరంలో కొత్తగా 2 లక్షల చ.అ. గిడ్డంగుల స్థలం సరఫరా అయ్యింది. గతేడాది ఇదే కాలంలో సరఫరా అయిన 6 లక్షల చ.అ.లతో పోలిస్తే ఇది 67 శాతం తక్కువ. ఈ ఏడాది క్యూ1లో దేశంలోని 8 ప్రధాన నగరాల్లో 90 లక్షల చ.అ. పారిశ్రామిక గిడ్డంగుల స్థల లావాదేవీలు జరిగాయి. గతేడాది ఇదే కాలంలో జరిగిన 78 లక్షల చ.అ. లావాదేవీలతో పోలిస్తే ఇది 15 శాతం అధికం. ఎక్కువగా ఇంజినీరింగ్ కంపెనీలు 25 శాతం, ఈ-కామర్స్ సంస్థలు 21 శాతం స్పేస్‌ను లీజుకు తీసుకున్నాయని కొలియర్స్ ఇండియా నివేదిక వెల్లడించింది. అలాగే ఈ క్యూ1లో కొత్తగా 94 లక్షల చ.అ. స్పేస్ సరఫరా అయింది. గతేడాది క్యూ1తో పోలిస్తే ఇది 16 శాతం ఎక్కువ.



# ఒకేచోట 15 లక్షల కార్లు

### ఇండియాలో సౌత్ కొరియా బ్రాండ్ హవా

సౌత్ కొరియన్ కార్ బ్రాండ్ అయిన 'కియా మోటార్స్'.. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురంలోని తన తయారీ కేంద్రం నుంచి 15 లక్షల వాహనాలను ఉత్పత్తి చేసి అరుదైన రికార్డ్ క్రియేట్ చేసింది. కియా ఇండియా 2019 ఆగస్టు నుంచి దేశీయ మార్కెట్లో అధిక ప్రజాదరణ పొందుతూ.. ఎప్పటికప్పుడు కొత్త కార్లను లాంచ్ చేస్తూ ఉంది. అతి తక్కువ కాలంలో ఈ ఉత్పత్తి మైలురాయిని చేరుకున్న కార్ల తయారీదారుగా కియా సరికొత్త చరిత్ర సృష్టించింది. అనంతపురం ప్లాంట్ కియా కార్యకలాపాలకు మూలస్తంభంగా ఉంది. కియా ఇండియా అనంతపురం ప్లాంట్లో సెల్టోస్, సోనెట్, కారెన్స్, కార్నివాల్, సైరోస్ వంటి కార్లను ఉత్పత్తి చేస్తోంది. కంపెనీ ఈ కార్లను భారతదేశంలో విక్రయించడం మాత్రమే కాకుండా.. ఇక్కడ నుంచి విదేశీ మార్కెట్లకు కూడా ఎగుమతి చేస్తుంది. ఉత్పత్తి గణాంకాల విషయానికొస్తే.. సెల్టోస్ 7,00,668 యూనిట్ల ఉత్పత్తితో (46.7%) ముందంజలో ఉంది. తరువాత సోనెట్ 5,19,064 యూనిట్లతో (34.6%) రెండవ స్థానంలో ఉంది. కారెన్స్ 2,41,582 యూనిట్లు (16.1%), సైరోస్ & కార్నివాల్ వంటి ఇటీవలి మోడళ్లు వరుసగా 23,036 యూనిట్లు (1.5%) మరియు 16,172 యూనిట్లు (1.1%)గా ఉన్నాయి.

## పెరిగిన అద్దెలు.. హైదరాబాద్‌లో అక్కడే ఫుల్ డిమాండ్!



కొనేటప్పుడు తక్కువ ధరకు కావాలి.. అమ్మేటప్పుడు ఎక్కువ ధర రావాలని కోరుకునేది స్థిరాస్తి రంగంలోనే.. ఇది అద్దె విభాగానికీ వర్తిస్తుంది. గత కొన్నేళ్లుగా దేశంలోని ప్రధాన నగరాలలో అద్దె గృహాల మార్కెట్ క్రమంగా పెరుగుతోంది. ప్రధానంగా మెరుగైన ప్రయాణ సాధనాలు, పని కేంద్రాలకు చేరువలో ఉన్న అద్దె ఇళ్లకు డిమాండ్ ఉంది. ప్రాపర్టీల విలువ పెరగడంతో గృహ యజమానులు అద్దెల కంటే లాభదాయకమైన ఆస్తుల విక్రయాల కోసం అన్వేషిస్తుండంతో సప్లయ్ తగ్గింది. దీంతో అద్దె గృహాలకు డిమాండ్‌తో పాటు రెంట్లు కూడా పెరిగాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది తొలి త్రైమాసికంలో హైదరాబాద్‌లో అద్దె గృహాలకు డిమాండ్ 22 శాతం మేర పెరిగింది. సరఫరా 2.1 శాతం క్షీణించగా.. సగటు రెంట్లు 4.5 శాతం మేర పెరిగాయి. అద్దెల మార్కెట్‌లో డిమాండ్ 50, సప్లయి వాటా 39 శాతంగా ఉన్నాయి.

### పశ్చిమంలో డిమాండ్ ఎక్కువ..

**గచ్చిబౌలి, మాదాపూర్ వంటి పశ్చిమ హైదరాబాద్ ప్రాంతాల్లోని అద్దె గృహాలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. కార్యాలయాలు, ఉపాధి కేంద్రాలకు సమీపంలో ఉండటం, ఔటర్ రింగ్ రోడ్డుతో మెరుగైన కనెక్టివిటీనే ప్రధాన కారణం. రూ.25 వేలు నుంచి రూ.35 వేలు నెలవారీ అద్దెలకు కోసం ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. 1,000 చ.అ. నుంచి 1,500 చ.అ. విస్తీర్ణంలో ఉన్న గృహాలకు డిమాండ్ అధికంగా ఉంది.**

## 2025 హంటర్ 350 బైక్ ఇదే: ధర ఎంతంటే?


రాయల్ ఎన్‌ఫీల్డ్ ఎట్టకేలకు దాని అత్యంత సరసమైన మోటార్‌సైకిల్.. హంటర్ 350ను కొత్త హంగులతో 2025 వెర్షన్‌గా మార్కెట్లో లాంచ్ చేసింది. ఈ బైక్ ధర రూ. 1.50 లక్షలు (ఎక్స్ షోరూమ్). ఇది దాని స్టాండర్డ్ మోడల్ కంటే ఎక్కువ అప్‌గ్రేడ్‌లను పొందుతుంది. 2025 హంటర్ 350 బైకులో అతిపెద్ద మార్పు సస్పెన్షన్ అప్‌గ్రేడ్. వెనుక భాగంలో మెరుగైన కంప్రెషన్ & రీబౌండ్ అనుభవాలను అందించే ప్రోగ్రెసివ్ స్ప్రింగ్‌లు లభిస్తాయి. అంతే కాకుండా ఇందులో స్లిప్ అండ్ క్లచ్ అసిస్ట్ క్లచ్ కూడా ఉంది. కొత్త హ్యాండిల్‌బార్, ఫాస్ట్ USB ఛార్జింగ్, కొత్త సీటు, కొత్త ఎగ్జాస్ట్ రూటింగ్ మాత్రమే కాకుండా పెరిగిన గ్రౌండ్ క్లియరెన్స్ వంటివి ఇక్కడ చూడవచ్చు. పర్ఫామెన్స్ పరంగా, ఇంజిన్‌లో ఎటువంటి మార్పులు లేవు. ఈ బైక్ మూడు కొత్త రంగులలో లభిస్తుంది. ఎంట్రీలెవల్ మోడల్ ధర రూ. 1.50 లక్షలు, మిడ్ వేరియంట్ ధర రూ. 1.77 లక్షలు, టాప్ ఎండ్ ధర రూ. 1.82 లక్షలు (అన్ని ధరలు, ఎక్స్ షోరూమ్).






# దేశం-విదేశం

NATIONAL-INTERNATIONAL



## తీవ్రవాదులను ఓడిద్దాం..

# దేశాన్ని గెలిపిద్దాం!



కేవలం పహల్‌గామ్‌లోనే కాదు, కేవలం పాకిస్తాన్‌లోనే కాదు, దేశమంతా ఉన్నారు. అవకాశవాద, అవినీతిలో నిండిన ప్రజా, సివిల్ అధికారుల వల్లనే టెర్రరిస్టులు బతుకుతున్నారు, టెర్రరిజం బతుకుతున్నది. టెర్రరిస్టు డబ్బుతో ఆ దేశం, ఈ దేశం అనికాదు, ప్రతి బిజినెస్‌లో పెద్దలు, నేతలు బతుకుతున్నారు. సిగ్గు సిగ్గు! రాబోయే పదేళ్లదాకా, లేదా వందేళ్లదాకా తీవ్రవాదం ఉంటుంది, ఉంచుతారు. వ్యాపారం కోసం, రాజకీయం కోసం! అధికారం కోసం, ఎన్నికల కోసం! అంతర్జాతీయంగా అన్నీ అమ్ముకోవడాలే గాని, జాతీయతా భావనే లేదు. నాయకులకే కాదు, సగం మంది ప్రజలకు కూడా సిగ్గు పడవలసిన 'దుర్మార్గం' ఎక్కువగా ఉంది. గుడికి దర్శనానికి వెళుతున్నాం. ప్రసాదాలను, నిజాలను నమ్ముకోకుండా, ఖనిజాలు అమ్ముకుంటున్నాం. ఆ ఖనిజం కోసం అడవులు నరికేస్తున్నాం. 'సత్యమేవ జయతే' అని మన జాతీయ నినాదం. 150 కోట్ల జనాల్లో ఎంతమంది నిజం చెబుతున్నారు? 'రామ్ నామ్ సత్య్ హై' అనేది మనదేశంలో చిత్తశుద్ధితో వినేవారున్నారా? రామ్ పేరుతో రాజకీయాలు, మతం పేరుతో అధికారాలతో ఆడు కుంటూ, పై పెదవుల కొస నుంచే 'జై శ్రీరామ్' అంటున్నాం. రామరాజ్యం రావడం లేదు. భక్తి లేదు, భయం లేదు. గర్భగుడులలో ఒక్కొక్క స్తంభానికి బంగారపు తాపడాలకు డబ్బిస్తాం కానీ పేదవాడికి తిండిచ్చేవాడు లేదు. అమెరికాలో అద్భుత ఆకాశాలను తాకే రెండు భవనాలను విమానాల్లో కూల్చిన దుర్మార్గం ద్వారా వందలాది జీవనాలు ధ్వంసమయ్యాయి(2001 సెప్టెంబర్ 11). నిన్న పహల్‌గామ్‌లో 26 మంది ప్రాణాలు తీసిన నేరం చిన్నదేం కాదు. వెంటాడి వేటాడి ఒక్కొక్కణ్ణి పట్టుకు శిక్ష వేస్తాం అంటున్న ప్రభుత్వానికి వందలాది వందనాలు. అమెరికా చేసిందేమిటి? మాటలు కాదు. తూటాలు కాదు. రాజకీయం కాదు. ఎక్కడున్నా సరే వేటాడి పట్టుకుని అమెరికాను కాపాడుకోవడానికి చూపిన కమిట్‌మెంట్ మనకు ఆదర్శం కావాలి. కమిట్‌మెంట్ అంటే కట్టుబాటు, దీక్ష. అకుంఠిత దీక్ష కావాలి. అది ఉందా? ఒక్కో మరణానికి కన్నీటి బిందువునైనా ఇచ్చుకున్నామా? క్రికెట్ మైదానంలో ఓ రెండు క్షణాలు నిలబడితే చాలా? కోట్ల కోట్ల వ్యాపారం కోసం, ప్రచారం కోసం మౌనమే సరిపోతుందా? ఒక్కో ప్రాణానికి, ఒక్కో సైనికుడి జీవనానికి డబ్బు ఇచ్చే దమ్ముందా? రాజ్యాంగాన్ని మార్చుకున్నారు. జమ్మూ కశ్మీర్ రాష్ట్రాన్ని కేంద్రపాలితం చేశారు. అంటే జరిగినదానికి రాష్ట్ర బాధ్యత లేదు, కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యత. టూరిస్టులయిన మామూలు మనుష్ళ్ని టెర్రరిస్టులకు బలిచేసిన ప్రభుత్వానికి బాధ్యత లేదా? పాకిస్తాన్, బంగ్లాదేశ్‌తో పాటు, మరికొన్ని భూభాగాలతో అఖండ భారత్ అనే నినాదాలు చేసే పెద్దలు... పక్కనున్న టెర్రరిస్టులు, మన నేల మీద మన వారిని చంపేస్తుంటే ఏం చేస్తున్నట్టు? పదేళ్ల ముందు దద్దమ్మలని పాత పాలకులను తిట్టిపోశాం. యూపీఏ చెత్త పరిపాలన వల్ల తీవ్రవాదులు జనాన్ని చంపేస్తున్నారన్నారు. మరి ఇప్పుడు 2025 దాకా ఏం చేస్తున్నట్టు? ఇప్పుడు మనకు నేతాజీ సుభాష్ చంద్రబోస్ వంటి మహానాయకుడు అవసరం. ప్రతి సైనికుడిని ఒక శక్తిగా మార్చి, తుపాకీలు ఎక్కుపెట్టినట్టే మహా ధైర్యంగా, రాజకీయ నాయకులను కూడా ప్రశ్నించి, నిజం చెప్పి, వ్యూహం నేర్పి భారత దేశాన్ని గెలిపించిన (1971 ఇండో-పాక్ యుద్ధం) ఫీల్డ్ మార్షల్ మానెక్‌శా వంటి సైన్యాధిపతులు మనకు అవసరం. ఆ విధంగా మన దేశాన్ని గెలిపిద్దాం. తీవ్రవాదులను మట్టి కరిపిద్దాం. చెత్త రాజకీయాలు కాదు, మన కైలాస హిమాలయాలున్న మన కశ్మీర్‌ను గెలిపిద్దాం. మన రాజ్యాన్ని, రాజ్యాంగాన్ని, రాజనీతిని నిలబెడదాం.

ప్రొ. మాడభూషి శ్రీధర్
మహీంద్రా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ లా ప్రొఫెసర్

# పహల్గామ్ హీరో.. మానవత్వంలో ధీరత్వం

ఏ మనిషికైనా కష్టం వస్తే సాయం చేసే వాళ్లని మానవత్వం ఉన్నవాళ్లుగా పరిగణిస్తాం. పక్కోడికి ఏమైతే మనకేంటి.. అనుకుంటే వారిని స్వార్థపరులే అనుకుంటాం. మరి మానవత్వంలో ధీరత్వం అంటే ఏమిటి? మనిషి చావు బ్రతుకుల్లో ఉన్నప్పుడు వారి ప్రాణాలను కూడా తన ప్రాణాలుగానే భావించి తెగువ చూపించి కాపాడితే అది మానవత్వంలో ధీరత్వమే అవుతుంది. ఇక్కడ తనకెందులే అనుకోకుండా ధీరత్వంతో కొంతమంది ప్రాణాల్ని కాపాడాడు ఓ వ్యక్తి. పహల్గామ్ ఉగ్రదాడి నుంచి కొంతమందిని కాపాడి హీరో అయ్యాడు. ఓ వైపు టెర్రరిస్టులు దాడులకు తెగబడిన తరుణంలో ఆ యువకుడు తన ప్రాణాలు తెగించి మరీ వారిని కాపాడాడు. విషయంలోకి వెళితే.. మంగళవారం (ఏప్రిల్ 22వ తేదీ) కశ్మీర్ లోని పహల్గామ్ ఉగ్రదాడితో రక్తసిక్తమైంది. కొంతమంది ఉగ్రవాదులు ఆర్మీ డ్రెస్సులు ధరించి వచ్చి అమాయక టూరిస్టుల ప్రాణాలు తీశారు. ఈ ఘటనలో 26 మంది అసువులు బాసారు. అయితే ఈ క్రమంలోనే కొంతమంది తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకుని బయటపడ్డారు. ఇలా సాయం చేయడంలో స్థానికంగా ఉన్న కొందరు సహకరించారు. తమ ప్రాణాలను పణంగా పెట్టి మరీ టూరిస్టులను కాపాడారు. ఇలా టూరిస్టులను కాపాడిన వారిలో పహల్గాగ్ కు చెందిన రాయిస్ అహ్మద్ భట్ ఒకరు. పహల్గామ్ లో పోనీ ఓనర్స్ అసోసియేషన్ కు



ప్రెసిడెంట్ గా ఉన్న అహ్మద్ భట్.. ఆ క్షణాలను మళ్లీ తలుచుకుంటేనే భయమేస్తుందన్నాడు. ఈ రోజు దాడి జరిగిన ప్రాంతానికి వెళ్లిన రాయీస్ అహ్మద్ భట్.. ఏఎన్ఐ పలకరించగా అక్కడ జరిగిన దాడి ఉదంతాన్ని చెప్పుకొచ్చాడు.

**ఆఫీస్ నుంచి అనుకోకుండా బయటకొచ్చి..**

ఈ టెర్రర్ అటాక్ అనేది మధ్యాహ్నం గం. 2.45ని. ప్రాంతంలో జరిగిందన్నాడు అహ్మద్ భట్. తనకు ఒక ఫోన్ వస్తే కవరేజ్ లేదని బయటకొచ్చిన క్రమంలో కొంతమంది టూరిస్టుల ఆర్తనాదాలు వినిపించాయన్నాడు. తమను రక్షించాలంటూ వారు చేస్తున్న రోదనతో తాను అప్రమత్తమైనట్లు పేర్కొన్నాడు. 'నేను ఆఫీస్ లో ఉన్నా. నాకు ఒక మెస్సేజ్ వచ్చింది. అది మా జనరల్ ప్రెసిడెంట్ నుంచి వచ్చిన మెస్సేజ్. ఆ మెస్సేజ్ చూసిన తర్వాత నేను తిరిగా కాల్ చేశాను. కానీ మొబైల్ కవరేజ్ సరిగా లేకపోవడంతో నేను ఫోన్ మాట్లాడుకుంటూ బయటకొచ్చా. అప్పుడు ఉగ్రదాడి జరుగుతుందనే విషయం పసిగట్టా. నేను ఆరుగుర్ని నాతో తీసుకుని అక్కడ నుంచి రెండు కిలోమీటర్ల వరకూ ఎత్తుపైకి వెళ్లాం. అక్కడ నుంచి చూస్తుంటే కింద భయానక వాతావరణం కనిపించింది. భయభ్రాంతులతో పరుగెడుతున్న పలువురు కనిపించారు. కేవలం వారి నుంచి రక్షించండి అనే ఆర్తనాదమే వస్తుంది. నీరు.. నీరు అంటూ కేకలు వేస్తూ ప్రాణం కోసం పరుగుపెట్టారు. నేను వారికి సాయం చేయడానికి మేము యత్నించాం. అడవిలో ఉన్న ఒక వాటర్ పైప్ వారికి వాటర్ అందించాం. ఆ తర్వాత వారికి ఒకటే చెప్పా. మీకు సురక్షితమైన జోన్ లో ఉన్నారనే విషయం చెప్పా. వారిని మా టీమ్ సభ్యులకు అప్పగించా. భయపడిన వారిని సురక్షితంగా తీసుకురావడమే మా మొదటి ప్రయత్నంగా భావించాం' అని చెప్పుకొచ్చాడు. ఆ తర్వాత కూడా పది నుంచి పదిహేనుమంది వరకూ తాను కాపాడినట్లు రాయీస్ భట్ తెలిపాడు. తమ టీమ్ సభ్యులంతా కలిసి చాలా మందిని ప్రాణాలతో కాపాడమన్నాడు. నేను బురదలో చిక్కుకుపోయిన కొంతమందిని తనతో పాటు తీసుకొచ్చానన్నాడు. ఆ తర్వాత వారిని గుర్రాలు ఎక్కించి వెనక్కి పంపించినట్లు పేర్కొన్నాడు.

### ఎక్కడ చూసినా ఆర్తనాదాలే..

**తాను తొలిసారి చూసినప్పుడు టూరిస్టులు ఎంట్రన్స్ గేట్ దగ్గర ఒక మృతదేహాన్ని చూశా. ఆ తర్వాత నాలుగైదు మృతదేహాలు కనిపించాయి. అక్కడ ఉన్న కొంతమంది గాయపడ్డ మహిళలు.. తమ భర్తలను రక్షించాలని వేడుకున్నారు. ఏదైతే అది అయ్యిందని మా టీమ్ సభ్యులమంతా గేట్ లోపలికి వెళ్లి ఆపరేషన్ స్టార్ట్ చేశామన్నాడు. ఇలా కొంతమందిని రక్షించామని రాయీస్ అహ్మద్ మీడియాకు తెలిపాడు.**

## జల్లెడ పడితే.. చీమల దండులా బయటకొచ్చారు!



**అహ్మదాబాద్:** పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం పాకిస్తాన్ జాతీయుల వీసాల రద్దు, వారిని తిరిగి వెనక్కి పంపించే చర్యలు కొనసాగుతున్న వేళ.. అక్రమంగా భారత్ లో నివసిస్తున్న విదేశీయులు వేల సంఖ్యలో బయటపడుతున్నారు. గుజరాత్ రాష్ట్రంలో పోలీసులు నిర్వహించిన కూంబింగ్ ఆపరేషన్ లో అక్రమంగా భారత్ కు వచ్చి ఇక్కడ ఎన్నో ఏళ్ల నుంచి నివసిస్తున్న బంగ్లాదేశ్ కు చెందిన వారు వెయ్యి మందికి పైగా ఉన్నట్లు గుర్తించారు. కూంబింగ్ ఆపరేషన్ లో భాగంగా అక్రమ వలస దారుల వేరివేతకు శ్రీకారం చుడితే అహ్మదాబాద్, సూరత్ లలో కలిపి వెయ్యి మందికి పైగా అక్రమ బంగ్లా దేశీయులను గుర్తించినట్లు ఆ రాష్ట్ర హోంమంత్రి హర్ష్ సంఘ్వీ శనివారం తెలిపారు. అహ్మదాబాద్ లో నివసిస్తున్న బంగ్లాదేశీయులు 890 మంది కాగా, సూరత్ లో నివసిస్తున్న బంగ్లా జాతీయులు 134 ఉన్నట్లు గుర్తించినట్లు హోంమంత్రి తెలిపారు. ఇది గుజరాత్ రాష్ట్రంలో అతిపెద్ద పోలీస్ ఆపరేషన్ అని ఆయన పేర్కొన్నారు.

## రష్యాకు ఆంక్షలతో చుక్కలు చూపిస్తే గానీ..!


**వాషింగ్టన్:** ఉక్రెయిన్ తో యుద్ధాన్ని రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆపేలా కనబడే చాయలు ఎక్కడా కనిపించడం లేదు. అప్పుడే శాంతి ఒప్పందం అంటూనే మరొకవైపు ఉక్రెయిన్ పై యుద్ధాన్ని కొనసాగిస్తూనే ఉన్నాడు పుతిన్. ఒకవైపు రష్యా, ఉక్రెయిన్ ల శాంతి ఒప్పందానికి అమెరికా చేస్తున్న ప్రయత్నాలు ఇప్పటివరకూ ఏమీ ఫలించలేదు. తాజాగా ఉక్రెయిన్ తో చర్చలకు సిద్ధమంటూ యూఎస్ కు సందేశం పంపిన పుతిన్ పై ట్రంప్ కొన్ని అనుమానాలు వ్యక్తం చేస్తున్నాడు. యుద్ధాన్ని ఆపుతామనే చెబుతున్నాడు కానీ ఎక్కడా అది కనిపించడం లేదని పుతిన్ శైలిపై కాస్త అసహనం వ్యక్తం చేశారు ట్రంప్. ట్రంప్ తన సోషల్ మీడియా హ్యాండిల్ 'ట్రూత్'లో కొన్ని విషయాలను చెప్పుకొచ్చాడు. ప్రధానంగా ఇటీవల ఉక్రెయిన్ జనావాసాల్లో రష్యా జరిపిన దాడిపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు జనావాసాలు ఉన్న ప్రాంతాల్లో పుతిన్ ఎందుకు దాడి చేశాడో సరైన కారణం లేదన్నాడు. ఇదే గత కొన్ని రోజుల నుంచి కొనసాగుతుందని, దీనివల్ల అనేక మంది అమాయక ప్రజలు చనిపోతున్నారన్నాడు. ఇక పుతిన్ విషయంలో కాస్త భిన్నంగా వ్యవహరించాల్సిందేనని ట్రంప్ తెలిపారు. పుతిన్ వ్యవహారాన్ని భిన్నంగా డీల్ చేయాలి. మాస్కో లక్ష్యంగా అదనపు ఆంక్షలు విధించి కట్టడి చేసే మార్గాన్ని చూస్తున్నాం. అని రాసుకొచ్చారు ట్రంప్. ప్రస్తుతం ఉక్రెయిన్ తో శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు శుక్రవారం రష్యా నుంచి అమెరికా ఓ సందేశం వెళ్లింది. ఇందులో ఎటువంటి ఆంక్షలు లేకుండా ఉక్రెయిన్ తో చర్చలకు కూర్చుంటామని అమెరికాకు తెలిపినట్లు రష్యా శనివారం స్పష్టం చేసింది.



## ఆ అనుబంధానికి పేరు పెట్టలేను!:సమంత

'జీవితంలో మనం తీసుకునే ఒక నిర్ణయాన్ని దృష్టిలో ఉంచుకొని కెరీర్ ఎలా ఉంటుందో చెప్పలేం. ఒకవేళ ఎవరైనా అలా నిర్ణయిస్తే అది అబద్ధమే అవుతుంది. తెలిసీ తెలియక తీసుకున్న ఎన్నో నిర్ణయాలు కెరీర్‌పై ప్రభావం చూపుతాయి'' అని సమంత అన్నారు. తమిళ చిత్ర పరిశ్రమలో ఇటీవల నిర్వహించిన 'గోల్డెన్ క్వీన్' పురస్కారాల్లో' గోల్డెన్ క్వీన్ అవార్డు అందుకున్నారు సమంత. అనంతరం ఆమె తన కెరీర్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఇంతమంది అభిమానులను సొంతం చేసుకోవడం నా అదృష్టంగా భావిస్తాను. నా అదృష్టంతోపాటు నేను పడిన కష్టమే ఈరోజు ఇంతమంది అభిమానం సంపాదించుకోవడానికి కారణం అయింది. ఇది దేవుడిచ్చిన వరంగా భావిస్తున్నాను'' అని చెప్పారు సమంత. ఇంకా తన వ్యక్తిగత జీవితం గురించి ఆమె మాట్లాడుతూ– "నా ఆరోగ్యం బాగాలేనప్పుడు రాహుల్ రవీంద్రన్ (నటుడు, దర్శకుడు) ఉదయం నుంచి సాయంత్రం వరకూ నాతోనే ఉంటూ జాగ్రత్తగా చూసుకున్నాడు. మా అనుబంధానికి పేరు పెట్టలేను. ఫ్రెండా? సోదరుడా? కుటుంబ సభ్యుడా? రక్త సంబంధీకుడా? అనేది చెప్పలేను'' అన్నారు. ఇక సమంత కెరీర్ విషయానికొస్తే... ప్రస్తుతం 'రక్త్ బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్‌డమ్' అనే వెబ్ సిరీస్ చేస్తున్నారు. అలాగే తన సొంత బ్యానర్ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్‌పై ఆమె నిర్మించిన తొలి చిత్రం 'శుభం' మే 9న రిలీజ్ కానుంది.





## తండ్రి-కొడుకు నుంచి ఒకేరోజు సర్ ప్రైజ్!

మే 9న అనగానే తెలుగు ఇండస్ట్రీకి బాగా కలిసొచ్చిన రోజు అని అంటారు. ఎందుకంటే అదే రోజున రిలీజై హిట్ అయిన సినిమాలు చాలానే ఉన్నాయి. మరీ ముఖ్యంగా చిరు చిత్రాలు ఆ రోజున రిలీజైనవి బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్స్ కూడా అయ్యాయి. ఇప్పుడు అదే తేదీన మెగా ఫ్యాన్స్ కి రెండు ట్రీట్స్ ఉండబోతున్నాయి. మొదటి దాని విషయానికొస్తే రామ్ చరణ్.. ఆర్ఆర్ఆర్ సినిమాతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నాడు. ఇప్పుడు ఇతడి మైనపు విగ్రహాన్ని లండన్ లోని మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో మే 9నే ఆవిష్కరించబోతున్నట్లు తెలుస్తోంది. ఇదివరకే ప్రభాస్, అల్లు అర్జున్ మైనపు విగ్రహాల్ని పెట్టగా.. ఇప్పుడు చరణ్ ఆ లిస్టులోకి చేరబోతున్నాడు. మరోవైపు చిరు కెరీర్ లో గుర్తుండిపోయే చిత్రాల్లో 'జగదేక వీరుడు అతిలోక సుందరి' ఒకటి. దీన్ని మే 9న రీ రిలీజ్ చేయబోతున్నారు. 2డీ, 3డీ వెర్షన్ తో ఈసారి ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు పోస్టర్ కూడా రిలీజ్ చేశారు. గతంలో మే 9నే ఈ సినిమా రిలీజై బ్లాక్ బస్టర్ హిట్ అయింది. ఇలా ఒకేరోజున మెగా అభిమానులకు రెండు ట్రీట్స్ రాబోతున్నాయనమాట. లెక్క ప్రకారం మరొకటి కూడా ఉండాలి. అదే 'హరిహర వీరమల్లు'. పవన్ కల్యాణ్ నటించిన ఈ లేటెస్ట్ చిత్రాన్ని మే 9నే రిలీజ్ ప్లాన్ చేశారు. కానీ ఈసారి కూడా వాయిదా గ్యారంటీ అని తెలుస్తోంది.

## ఇదెక్కడి అభిమానం రా బాబు.. ఏకంగా పెళ్లి కార్డుపై మహేశ్



తెలుగు ప్రేక్షకుల అభిమానం గురించి ఎంత చెప్పుకొన్నా తక్కువే. చిన్నా పెద్దా అని సంబంధం ఉండదు. మన భాష పరభాష అనేది పట్టించుకోరు. సినిమా నచ్చితే చాలు.. ఆ మూవీని, సదరు హీరోల్ని గుండెల్లో పెట్టేసుకుంటారు. ఇకపోతే తెలుగులోనూ కొందరు స్టార్ హీరోలకు కోట్లాది మంది ఫ్యాన్స్ ఉన్నారు. వీళ్లలో కొందరు అప్పుడప్పుడు చిత్రవిచిత్రమైన పనులు చేస్తుంటారు. కర్నూలుకు చెందిన సాయి చరణ్ అనే కుర్రాడు.. సూపర్ స్టార్ మహేశ్ బాబుకు వీరాభిమానిలా ఉన్నాడు. ఎందుకంటే వచ్చే నెలలో తన పెళ్లి ఉంది. దీనికోసం ఇప్పుడు వెడ్డింగ్ కార్డ్స్ పంచుతున్నాడు. అందరిలా కాకుండా తన పెళ్లి పత్రికపై దేవుళ్ల ఫొటోలతో పాటు తను ఎంతో అభిమానించే మహేశ్ బాబు పిక్ కూడా ప్రింట్ చేశాడు. దీన్ని కొందరు ఫొటో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో ఇది కాస్త ఇప్పుడు వైరల్ అవుతుంది. ఇదెక్కడి అభిమానం రా బాబు అని నెటిజన్లు మాట్లాడుకుంటున్నారు. ఇదే కాదు గతంలోనూ ఓసారి ఇలానే ఓ అభిమాని.. తన పెళ్లి కార్డుపై మహేశ్ బాబు ఫొటోని ముద్రించాడు. అప్పట్లోనూ దాని గురించి మాట్లాడుకున్నారు. మహేశ్ బాబు సినిమాల విషయాలనికొస్తే.. ప్రస్తుతం రాజమౌళితో సినిమా చేస్తున్నాడు. 2027లో ఇది రిలీజ్ అవ్వొచ్చని అంటున్నారు. కానీ రాజమౌళితో మూవీ అంటే ఎప్పుడొస్తుందో చెప్పలేం. ప్రస్తుతానికైతే రెండు షెడ్యూల్స్ పూర్తయ్యాయి. త్వరలో కొత్త షెడ్యూల్ ప్రారంభం కానుందని తెలుస్తోంది. మే నెలలో ఈ ప్రాజెక్ట్ గురించి అధికారిక ప్రకటన ఉండొచ్చని తెలుస్తోంది.

## కాపీ రైట్స్ కేసు.. దిల్‌రాజుకు మధ్యంతర రక్షణ కొనసాగింపు



**న్యూఢిల్లీ:** ప్రముఖ సినీ నిర్మాత దిల్ రాజుకు ఇచ్చిన మధ్యంతర రక్షణను సుప్రీంకోర్టు కొనసాగించింది. మిస్టర్ పర్‌ఫెక్ట్ సినిమా కాపీరైట్ వివాదానికి సంబంధించి నిర్మాత వి.వెంకటరమణారెడ్డి అలియాస్ దిల్ రాజుపై చర్యలు తీసుకోవాలంటూ సిటీ సివిల్ కోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే విధిస్తూ సుప్రీంకోర్టు ఇప్పటికే మధ్యంతర రక్షణ ఇచ్చింది. అంతేగాక తదుపరి విచారణ వరకు దిల్ రాజుపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది. శుక్రవారం సుప్రీంకోర్టులో జరిగిన విచారణ సందర్భంగా మధ్యంతర రక్షణను కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 'నా మనసు నిన్ను కోరే నవల' ఆధారంగా 'మిస్టర్ పర్‌ఫెక్ట్' అనే సినిమా తీశారంటూ రచయిత్రి ముమ్ముడి శ్యామలాదేవి 2017లో దిల్ రాజుపై కేసు పెట్టారు. దీంతో మాదాపూర్ పోలీసులు నిర్మాత దిల్ రాజుపై కాపీ రైట్ చట్టం కింద కేసు నమోదు చేశారు. ఆ తర్వాత ఈ కేసు విచారణ హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో జరిగింది. విచారణ సందర్భంగా ఇరుపక్షాల వాదనలు విన్న సిటీ సివిల్ కోర్టు, సాక్ష్యాలను పరిశీలించి దిల్ రాజుపై చర్యలు తీసుకోవాలని 2019లో ఆదేశించింది. ఈ ఉత్తర్వులను కొట్టివేయాలంటూ దిల్‌రాజు సుప్రీం కోర్టును ఆశ్రయించగా జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. దిల్ రాజుపై చర్యల విషయంలో గతంలో ఇచ్చిన మధ్యంతర రక్షణను కొనసాగించిన జస్టిస్ జె.బి.పార్ధీవాలా ధర్మాసనం, తదుపరి విచారణను వాయిదా వేస్తూ.. అప్పటి వరకు సిటీ సివిల్ కోర్టు ఉత్తర్వులపై స్టే విధించింది.

# క్రీడా వార్తలు SPORTS NEWS

## బీసీసీఐ పొమ్మంది
### అభిషేక్ నాయర్‌కు మరో ఆఫర్?



టీమిండియా అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్‌పై బీసీసీఐ వేటు వేసిన సంగతి తెలిసిందే. భారత క్రికెట్ జట్టుతో తెగదింపులు చేసుకున్న నాయర్.. తిరిగి మళ్లీ కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టుతో జతకట్టాడు. కేకేఆర్ కోచింగ్ స్టాఫ్‌లో అభిషేక్ భాగమయ్యాడు. గతేడాది సీజన్‌లో కోల్‌కతాను ఛాంపియన్‌గా నిలపడంలో నాయర్‌ది కీలక పాత్ర. మరోసారి తమ జట్టును విజయపథంలో నడిపిస్తాడని నాయర్‌పై కేకేఆర్ మెనేజ్‌మెంట్ గంపెడు ఆశలు పెట్టుకుంది. అయితే ఐపీఎల్ మధ్యలోనే నాయర్‌కు మరో ఆఫర్ వచ్చినట్లు తెలుస్తోంది. ముంబై టీ20 లీగ్‌లో ముంబై సౌత్ సెంట్రల్ మరాఠా రాయల్స్ జట్టు మెంటార్‌గా నాయర్ ఎంపికనైట్లు టైమ్స్ ఆఫ్ ఇండియా తమ కథనంలో పేర్కొంది. అభిషేక్ నాయర్‌ను ముంబై సౌత్ సెంట్రల్ మరాఠా రాయల్స్ తమ మెంటార్‌గా నియమించింది. త్వరలోనే అభిషేక్ నాయర్ ఎంపికపై అధికారిక ప్రకటన వెలవడనుంది అని క్రికెట్ వర్గాలు వెల్లడించాయి. ఈ టోర్నమెంట్ మే 26 నుంచి ప్రారంభం కానుంది. అదేవిధంగా ఈ టోర్నీలో భారత మాజీ బౌలింగ్ కోచ్ పరాస్ మాంబ్రే అంధేరీ జట్టుకు ప్రధాన కోచ్‌గా వ్యవహరించనున్నాడు. వీరితో పాటు ఓంకార్ సాల్వి సోబో ముంబై ఫాల్కన్స్‌కు, ఐపీఎల్ మాజీ స్టార్ ప్రవీణ్ తంబే నార్త్ ముంబై పాంథర్స్‌కు హెడ్ కోచ్‌గా ఎంపికయ్యారు.

## మూడేళ్లుగా సింగిల్‌గానే..
# ఆమెతో ప్రేమలో లేను..!

భారత జట్టు వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్(Shubman Gill) తన ఆటతోనే కాదు డేటింగ్ రూమర్స్‌తోనూ నిత్యం వార్తల్లో నిలుస్తుంటాడు. గత కొన్ని రోజులుగా ఈ యంగ్‌స్టర్ మాజీ క్రికెటర్ కూతురుతో, బాలీవుడ్ నటితో లవ్ ట్రాక్ నడుపుతున్నాడనే వార్తలు వినిపిస్తున్నాయి. సచిన్ టెండూల్కర్ కూతురు సారా(Sara)తో, నటి సైఫ్ అలీ ఖాన్(Saif Ali Khan)తో ప్రేమలో ఉన్నాడనే వదంతులతో విసిగిపోయిన గిల్.. తన లవ్ లైఫ్ గురించి వస్తున్న అపోహలపై స్పందించాడు. తాను మూడేళ్లుగా సింగిల్‌గానే ఉన్నానని.. ఎవరితోనూ ప్రేమలో లేనని కుండబద్ధలు కొట్టాడు. 'నేను ఎవరినీ లవ్ చేయడం లేదు. మూడేళ్లుగా సింగిల్‌గానే ఉంటున్నా. అయినా సరే.. కొందరితో నేను డేటింగ్ చేస్తున్నట్టు కథనాలు ప్రచారం చేస్తున్నారు. నేను జీవితంలో ఒక్కసారి కూడా కలవని వ్యక్తులతో నాకు సంబంధం అంటగడుతున్నారు. ప్రస్తుతానికైతే నా దృష్టంతా క్రికెట్ మీదే ఉంది. ఏడాదిలో 300 రోజులకుపైగా క్రికెట్ గురించే ఆలోచిస్తా. అలాంటప్పుడు రిలేషన్‌షిప్‌లో ఉండేంత తీరిక నాకు లేదు. క్రికెట్‌తోనే నాకు పొద్దు పోతోంది. సో.. వదంతులకు ఇకనైనా ముగింపు పలకండి' అని గిల్ వెల్లడించాడు. ఈమధ్యే బాలీవుడ్ నటి అవ్‌నీత్ కౌర్(Avneet Kaur)తో గిల్ ప్రేమాయాణం నడుపుతున్నాడనే వార్తలు వైరలయ్యాయి. ఈ నేపథ్యంలో తన రిలేషన్‌షిప్ స్టేటస్ గురించి అందరికీ స్పష్టత ఇవ్వాలనుకున్నాడీ టీమిండియా స్టార్.



### పెళ్లి ఎప్పుడు చేసుకుంటావ్?

ఐపీఎల్ 18వ సీజన్‌లో శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని గుజరాత్ టైటాన్స్ అదరగొడుతోంది. వరుస విజయాలతో టేబుల్ టాపర్‌గా నిలిచింది గిల్ సేన. ఐపీఎల్ 18వ ఎడిషన్‌లో ఓపెనర్‌గా, సారథిగా రాణిస్తూ గుజరాత్ టైటాన్స్‌ను టేబుల్ టాపర్‌గా నిలిపాడీ యంగ్‌స్టర్. అయితే.. ఈమధ్యే టాస్ సమయంలో గిల్‌ను 'పెళ్లి ఎప్పుడు చేసుకుంటావ్?' అని కామెంటేటర్ డాని మోరిసన్ అడిగిన విషయం తెలిసిందే. ఊహించని ప్రశ్న ఎదురువడంతో ఈ మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ సిగ్గుపడిపోయాడు. ఇప్పట్లో పెళ్లి ఆలోచన లేదని, తన ధ్యాసంతా క్రికెట్ మీదనే అని బదులిచ్చాడు.



## మరి ఇంత చెత్త బ్యాటింగా?
### జట్టు నుంచి తీసేయండి

ఐపీఎల్2025లో పంజాబ్ కింగ్స్ స్టార్ ఆల్‌రౌండర్ గ్లెన్ మాక్స్‌వెల్ పేలవ ప్రదర్శన కొనసాగుతోంది. ఈడెన్‌గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో మాక్స్‌వెల్ తీవ్ర నిరాశపరిచాడు. గత మ్యాచ్‌కు దూరంగా ఉన్న మాక్సీకి పంజాబ్ మెనేజ్‌మెంట్ తిరిగి తుది జట్టులో చోటు ఇచ్చింది. మార్కస్ స్టొయినిష్ స్థానంలో జట్టులోకి వచ్చిన మాక్స్‌వెల్ ఏ మాత్రం ప్రభావం చూపలేకపోయాడు. కీలక సమయంలో క్రీజులోకి వచ్చిన మాక్స్‌వెల్.. కేకేఆర్ బౌలర్లను ఎదుర్కోవడానికి ఇబ్బంది పడ్డాడు. మరోసారి వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌లో మాక్సీ పెవిలియన్‌కు చేరాడు. వరుణ్ అద్భుతమైన బంతితో ఈ ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. ఈ మ్యాచ్‌లో 8 బంతులు ఎదుర్కొన్న మాక్స్‌వెల్..87.50 స్ట్రైక్ రేటుతో కేవలం 7 పరుగులు మాత్రమే చేశాడు. ఓవరాల్‌గా ఈ ఏడాది సీజన్‌లో ఇప్పటివరకు 7 మ్యాచ్‌లు ఆడిన మాక్స్‌వెల్.. 8.00 సగటుతో కేవలం 48 పరుగులు చేశాడు. దీంతో మాక్స్‌వెల్‌ను నెటిజన్లు దారుణంగా ట్రోలు చేస్తున్నారు. ఐపీఎల్ చరిత్రలోనే చెత్త ప్లేయర్ అంటూ ఎక్స్‌లో ఫ్యాన్స్ పోస్ట్‌లు పెడుతున్నారు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది. పంజాబ్ బ్యాటర్లలో ప్రభ్‌సిమ్రాన్ సింగ్(83) టాప్ స్కోరర్‌గా నిలవగా.. ప్రియాన్ష్ ఆర్య(69), శ్రేయస్ అయ్యర్(25) రాణించారు.

## ఆర్సీబీతో మ్యాచ్.. ఢిల్లీ క్యాపిటల్స్‌కు గుడ్ న్యూస్

ఐపీఎల్2025లో ఢిల్లీ క్యాపిటల్స్ (DC) ఆదివారం అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (RCB)తో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచి పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి దూసుకు వెళ్లాలని ఢిల్లీ భావిస్తోంది. ఈ కీలక మ్యాచ్‌కు ముందు ఢిల్లీ క్యాపిటల్స్ గుడ్ న్యూస్ అందింది. ఆ జట్టు స్టార్ ఓపెనర్, దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ ఫాఫ్ డుప్లెసిస్ పూర్తి ఫిట్‌నెస్ సాధించాడు. ఫాఫ్ గాయం కారణంగా వరుసగా నాలుగు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. ఇప్పుడు ఫుల్ ఫిట్‌నెస్ సాధించడంతో ఆర్సీబీతో మ్యాచ్‌లో డుప్లెసిస్ ఆడనున్నాడు. ఈ విషయాన్ని ఢిల్లీ క్యాపిటల్స్ యువ ఓపెనర్ జాక్ ఫ్రెజర్ మెక్‌గర్క్ ధ్రువీకరించాడు. ఆర్సీబీతో మ్యాచ్‌కు ఫాఫ్ డుప్లెసిస్ అందుబాటులో ఉండనున్నాడు. నెట్స్‌లో కూడా ప్రాక్టీస్ చేస్తున్నాడని మెక్‌గర్క్ ప్రీమ్యాచ్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పేర్కొన్నాడు. శనివారం అరుణ్ జైట్లీ స్టేడియం నెట్స్‌లో డుప్లెసిస్ తీవ్రంగా శ్రమించాడు. దీంతో అతడు తిరిగి రావడం దాదాపు ఖాయమైంది. డుప్లెసిస్ తిరిగి వస్తే కరుణ్ నాయర్‌పై వేటు పడే అవకాశముంది. ఢిల్లీ క్యాపిటల్స్ ప్లేయింగ్ ఎలెవన్(అంచనా): అభిషేక్ పోరెల్, ఫాఫ్ డు ప్లెసిస్, కరుణ్ నాయర్, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), అక్షర్ పటేల్ (కెప్టెన్), ట్రిస్టన్ స్టబ్స్, అశుతోష్ శర్మ, విప్రజ్ నిగమ్, మిచెల్ స్టార్క్, కుల్దీప్ యాదవ్, దుష్మంత చమీర, ముఖేష్ కుమార్



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com